

నిష్పక్షపాత వార్తల నిజరూపం

22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

శుక్రవారం 16-10-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 176 రూ॥ 6.00










# డ్యాషింగ్ బాస్.. తిరిగి తెలంగాణకు!



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

- అకున్ సబర్వాల్ క్వాలిఫైడ్ డెంటిస్ట్ కూడా
- సతీమణి స్మితా సబర్వాల్ ఐఏఎస్ అధికారిణి
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్‌గా రాష్ట్ర వ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు
- డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించడంలో అసాధారణ చొరవ
- నిర్భయంగా డ్యూటీ నిర్వహించి 'రియల్ హీరో' అనిపించుకున్నారు
- చదువుకునే రోజుల్లో ఆయన ర్యాగింగ్ బాధితులు
- అందుకనే ర్యాగింగ్ కి బ్యాండ్ బాజాన్ కార్యక్రమం అమలు
- 'సన్నిహితం' ద్వారా ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు












- ఫార్మా రంగంలో జవాబుదారీతనం పెంచిన 'నోబిల్...నోపిల్' కార్యక్రమం
- 'రా', 'ఐటీబీపీ'ల్లో అద్భుత సేవలు

**హైదరాబాద్, నేటిధాత్రి:** తెలంగాణ పోలీస్ వ్యవస్థలో తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న డైనమిక్, డాషింగ్ పోలీస్ ఆఫీసర్ డాక్టర్ అకున్ సభర్వాల్ సుదీర్ఘ కాలం పాటు కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) ఐజీగా, దేశ సరిహద్దుల్లో విశేష సేవలు అందించిన ఆయన, ఇటీవల తిరిగి తెలంగాణ క్యాడర్‌లోకి రీఎంట్రీ ఇచ్చారు.

అకున్ సభర్వాల్ కేవలం లా అండ్ ఆర్డర్ కాపాడే ఆఫీసర్ మాత్రమే కాదు, వఅత్తిరీత్యా ఆయన ఒక క్వాలిఫైడ్ డెంటిస్ట్ (వైద్యుడు). కేవలం 23 ఏళ్ల చిన్న వయసులోనే యూపీఎస్సీ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 33వ ర్యాంకు సాధించి, ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. సమాజంలో మరింత విస్తఅతంగా మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన ఖాకీ యూనిఫాం ధరిం చారు. ఆయన సతీమణి స్మితా సభర్వాల్ కూడా దేశంలోనే గుర్తింపు పొందిన సీనియర్ ఐఏఎస్‌అధికారిణి కావడం గమనార్హం. తెలంగాణలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన కా లంలో అకున్ సభర్వాల్ పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగింది. ముఖ్యంగా హైదరాబాద్‌ను కుది పేసిన భారీ డ్రగ్స్ రాకెట్‌ను చేధించడంలో ఆయన చూపిన చొరవ అసాధారణం. ఎంతటి అగ్రశ్రేణి ప్రముఖులైనా వెనకాడకుండా విచారించి, చట్టం ముందు నిలబెట్టారు. అంతర్జాతీయ డ్రగ్ మాఫియా నుంచి బెదిరింపులు వచ్చినా లొంగకుండా, నిర్భయంగా డ్యూటీ నిర్వహించి ప్రజల చేత 'రియల్ హీరో' అనిపించుకున్నారు.

## 'ర్యాగింగ్ కి బ్యాండ్ బజావ్'

ఆయన హైదరాబాద్ సెంట్రల్ జోన్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) గా మరియు నగర యాంటీ–ర్యాగింగ్ సెల్ అధిపతిగా ఉన్న సమయంలో కాలేజీల్లో ర్యాగింగ్ మహమ్మారిని పూర్తిగా అరికట్టడానికి ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ అకున్ సభర్వాల్ ఐపీఎస్ కావ డానికి ముందు ఒక డెంటిస్ట్ (వైద్యుడు). ఆయన కాలికట్‌లోని ఒక వైద్య కళాశాలలో చదువుతున్న సమయంలో తీవ్రమైన ర్యాగింగ్‌కు గురయ్యారు. ఆ వేధింపులు తట్టుకోలేక ఆయన ఆ కాలేజీని వదిలేసి వేరే కాలేజీలో చేరాల్సి వచ్చింది. ర్యాగింగ్ అనేది విద్యార్థులపై ఎలాంటి మానసిక ప్రభావం చూపుతుందో సొంతంగా అనుభవించిన వ్యక్తి కాబట్టి, ఏ విద్యార్థి కూడా అలాంటి పరిస్థితిని ఎదుర్కోకూడదనే బలమైన సంకల్పంతో ఆయన ఈ ప్రచారాన్ని డిజైన్ చేశారు. ఈ కార్య క్రమం కింద కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, విద్యాసంస్థల యాజమాన్యా లు, కౌన్సిలర్లు మరియు విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ విస్తఅతమైన సమావేశాలు నిర్వహిం చారు. 'సొసైటీ ఎగైనెస్ట్ వయలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్' వంటి స్వచ్ఛంద సంస్థల సహాయాన్ని కూడా తీసుకున్నారు. కాలేజీ క్యాంపస్‌లతో పాటు విద్యార్థులు ఎక్కువగా తిరిగే బస్ స్టాపులు, మహిళా కళాశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బఅందాలను రంగంలోకి దించారు. ర్యాగింగ్ లే దా ఈవ్–టీజింగ్‌కు పాల్పడుతూ పట్టుబడిన వారికి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చేవారు. తప్పు రిపీట్ అయితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునేవారు. విద్యార్థులు నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు యాంటీ–ర్యాగింగ్ హెల్ప్‌లైన్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలను కాలేజీల్లో విరివిగా ప్రచారం చేశారు. "ర్యాగింగ్ అనేది శారీరక సమస్య కంటే మానసిక సమస్య" అని బలంగా నమ్మిన అకున్ సభర్వాల్ గారు, ఈ ప్రచారం ద్వారా హైదరాబాద్‌లోని విద్యాసంస్థ ల్లో వేధింపులు లేని స్నేహపూర్వక వాతావరణాన్ని తీసుకురావడంలో అద్భుతమైన విజయాన్ని సాధించారు.

## సమస్యల మూలాలను తుడిచిపెట్టడంలో అకున్ సభర్వాల్ శైలి విభిన్నంగా ఉంటుంది. ఆయన చేపట్టిన కొన్ని అద్భుతమైన కార్యక్రమాల వివరాలు...

## 'నోబిల్ నో పిల్'

డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మడాన్ని అరికట్టేందుకు 'నో బిల్ నో పిల్' పేరుతో వినూత్న ప్రచారాన్ని ప్రారంభించారు. డాక్టర్ల అధికారిక ప్రిస్క్రిప్షన్ (చిట్టీ) లేకుండా మెడికల్ షాపుల వారు వినియోగదారులకు నేరుగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ లేదా ఇతర తీవ్రమైన మందులను విక్రయించడాన్ని అరికట్టడం దీని ప్రధాన లక్ష్యం. ఏ మందులు కొన్నా సరే దానికి సంబంధించిన ఖచ్చితమైన బిల్లును (రశీదును) మెడికల్ షాపుల వారు కస్టమర్లకు ఇవ్వాలి, వినియోగదారులు కూడా బిల్లు అడిగి మరీ తీసుకోవాలి. యువత లేదా ఇతరులు మత్తు కోసం కొన్ని రకాల షెడ్యూల్ డ్రగ్స్ మరియు ఓవర్–ది–కౌంటర్ మందులను దుర్వినియోగం చేయకుండా నియంత్రించడం. వఅత్తిరీత్యా వైద్యుడు (డెంటిస్ట్) కావడం తో, అకున్ సభర్వాల్ గారు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సొంత వైద్యం వల్ల జరిగే నష్టాల గురించి మెడికల్ షాపుల యజమానులకు మరియు సాధారణ ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ 'నో బిల్.. నో పిల్' ఉద్యమం ఫార్మసీ రంగంలో జవాబుదారీతనాన్ని పెంచడమే కాకుండా, ప్రజల్లో ఆరోగ్య స్పఅహను కూడా పెంపొందించింది.

## 'సన్నిహితం'

ప్రజలు సులువుగా ఫిర్యాదులు చేసి, రశీదు పొందేలా పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అ మల్లోకి తెచ్చారు. ఇది డాక్టర్ అకున్ సభర్వాల్ ప్రారంభించిన ఒక విశిష్టమైన పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమం. ఆయన హైదరాబాద్ సెంట్రల్ జోన్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ వినూత్న పోలీస్ హెల్ప్ సెంటర్లను ఏర్పాటు చేశారు. సాధారణంగా ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలంటే భయపడతారు లేదా ఇబ్బంది పడతారు. ఈ భయాన్ని పోగొట్టడానికి, సాధారణ పౌరులు నేరుగా వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేసేలా 'సన్నిహితం' కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఫిర్యాదు చేసిన వెంటనేబాధితులకు ఖచ్చితమైన రశీదును అందజేసే విధానాన్ని తెచ్చారు. దీనివల్ల తమ ఫిర్యాదు నమోదైందనే నమ్మకం ప్రజల్లో కలిగింది. ఈ కేంద్రాల ద్వారా శాంతిభద్రతల సమస్యలతో పాటు ట్రా ఫిక్ ఇబ్బందులు, దొంగతనాలు, మైనర్లకు హుక్కా సరఫరా చేయడం వంటి పట్టణ సమస్యలపై వేగంగా స్పందించి చర్యలు తీసుకునేవారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో నగరంలో తీవ్ర ఉద్రిక్తతలు ఉన్న నేపథ్యంలో, ప్రజలకు పోలీసులను మరింత దగ్గర చేయడానికి (సన్నిహితంగా ఉంచడానికి) ఈ వ్యవస్థ ఎంతగానో దోహదపడింది. పోలీస్ స్టేషన్ల వాతావరణాన్ని మార్చి, బాధితులకు భరోసా కల్పించడంలో డాక్టర్ అకున్ సభర్వాల్ గారి 'సన్నిహితం' చొరవ పోలీస్ వ్యవస్థలో ఒక ఆదర్శవంతమైన మైలురాయిగా నిలిచింది.

## సుదీర్ఘకాలం తర్వాత తిరిగి తెలంగాణకు...

సుదీర్ఘకాలం పాటు కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్‌పై పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ అకున్ సభర్వాల్ అక్టోబర్ 2026 లో అధికారికంగా తెలంగాణ క్యాడర్‌లోకి తిరిగి వచ్చారు. కేంద్ర డిప్యుటేషన్ పూర్తి చేసుకుని రాష్ట్రానికి వచ్చిన అకున్ సభర్వాల్, హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని రిపోర్ట్ చేశారు. ప్రస్తుతం అకున్ సభర్వాల్ గారితో పాటు కేంద్ర డిప్యుటేషన్ ముగించుకుని వచ్చిన మరో సీనియర్ అధికారిణి చారు సిన్హా (1996 బ్యాచ్) ఇద్దరూ ప్రభుత్వ నియామకం కోసం వేచి చూస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే ఐజీ, అడిషనల్ డీజీపీ ర్యాంక్ అధికారుల బదిలీలు మరియు భారీ ఐపీఎస్ అధికారుల పునర్వ్యవస్థీకరణ చేపట్టే యోచనలో ఉంది, అందులో భా గంగానే ఆయనకు ఒక కీలకమైన బాధ్యత అప్పగించనున్నట్లు టాక్ నడుస్తోంది. అకున్ సభర్వాల్‌తెలంగాణకు తిరిగి రావడంతో, 2017లో ఆయన నేతఅత్వంలోని 'సిట్' విచారించిన సంచలన టాలీవుడ్ డ్రగ్స్ కేసు ఫైళ్లు మళ్లీ తెరపైకి వచ్చే అవకాశం ఉందనే ప్రచారం పోలీస్ మరియు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలన పై (ఉదాహరణకు టీజీఎన్?ఏబీ ఏర్పాటు ద్వారా) ఉక్కుపాదం మోపుతుండటంతో, అకున్ సభర్వాల్ సేవలను ఆ దిశగా ఉపయోగించుకునే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## డ్రగ్స్ నివారణకు సాహసోపేత నిర్ణయాలు

డాక్టర్ అకున్ సభర్వాల్ తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా, ప్రత్యేక దర్యాప్తు బృందం అధిపతిగా ఉన్నప్పుడు డ్రగ్స్ మాఫియా నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకలించడానికి అత్యంత సా హసోపేతమైన, సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. డ్రగ్స్ కేసుకు సంబంధించి తొలినాళ్లలో ఒక పెడ్లర్ పోలీసులకు దొరికి సహకరించడం లేదని సమాచారం రాగానే, అకున్ సభర్వాల్ ఎటు వంటి హంగూ ఆర్భాటం లేకుండా కేవలం సాధారణ షార్ట్స్, చప్పల్స్ ధరించి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఆయన పెద్ద ఆఫీసర్ అని తెలియని ఆ పెడ్లర్, ఎంతో క్యాజువల్‌గా మాట్లాడు తూ హైదరాబాద్ నగరంలోని కొన్ని పెద్ద పెద్ద పేర్లను బయటపెట్టాడు. ఆ సమాచారంతోనే ఆయన ఈ భారీ అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్ మూలాలను ఛేదించగలిగారు. డ్రగ్స్ విచారణ అత్యంత కీలక దశకు చేరుకున్న సమయంలో, అకున్ సభర్వాల్ తన తల్లిగారి సంవత్సరీక కర్మల కోసం సెలవుపై వెళ్లాల్సి ఉంది. అయితే, ఆయన సెలవుపై వెళ్తే కేసు పక్కదారి పడుతుందని, రాజకీయ ఒత్తిళ్ల వల్లే ఆయన తప్పుకుంటున్నారని మీడియాలో ఊహాగానాలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఆయన, వ్యక్తిగత సెంటిమెంట్ల కంటే కర్తవ్యమే మిన్న అని భావించి తన సెలవును రద్దుచేసుకున్నారు. "కేసు విచారణ పూర్తయ్యే వరకు నేను సెలవుపై వెళ్లను" అని ప్రకటించి విచారణను మరింత వేగవంతం చేశారు. డ్రగ్స్ కేసులో పెద్దల పేర్లు బయటకు వస్తున్న కొద్దీ, ఆయనకు అంతర్జాతీయంగా ఆఫ్రికన్ యాసతో కూడిన వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ (వీఓఐపీ) ద్వారా తీవ్రమైన బెదిరింపు కాల్స్ వచ్చాయి. నీ పిల్లలు ఏ స్కూల్లో చదువుతున్నారో మాకు తెలుసు అంటూ దుండగులు ఆయన కుటుంబ సభ్యులను టార్గెట్ చేస్తూ బెదిరించారు. అయినప్పటికీ ఆయన అంగుళం కూడా వెనక్కి తగ్గలేదు, భయపడకుండా తన టీమ్‌తో కలిసి విచారణను నిష్పక్షపాతంగా ముందుకు తీసుకెళ్లారు. డ్రగ్స్ అనేది కేవలం వినోద రంగం (సినీ పరిశ్రమ) లోనే కాకుండా, నగరంలోని ప్రముఖ కార్పొరేట్ స్కూళ్లు, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థుల వరకు విస్తరించిందని గుర్తించిన సభర్వాల్, ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలకు గట్టి హెచ్చరికలు జారీచేశారు. విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ లేదా గంజాయి సప్లై కాకుండా ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి, ఎంతోమంది విద్యార్థుల జీవితాలు నాశనం కాకుండా కాపాడారు. ఆ సమ యంలో కొంతమంది రాజకీయ నాయకులు, ప్రముఖులు విచారణ తీరును తప్పుబడుతూ సోషల్ మీడియా మరియు ప్రెస్‌లో కామెంట్స్ చేసినప్పుడు.. ఆయన ప్రెస్ మీట్ పెట్టి మరీ తీవ్రంగాస్పందించారు. "మేము సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారమే, ఎన్‌డీపీఎస్ చట్టం 1985 లోని నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నాం" అని స్పష్టం చేస్తూ, అధికారుల డ్యూటీని తప్పుబట్టి సమా జంలో భయాందోళనలు సఅష్టిస్తే డిఫమేషన్ (క్రిమినల్ అవహేళన) కేసులు పెడతామని హెచ్చరించారు. ఆయన తీసుకున్న ఇటువంటి సంచలన, నిక్కచ్చి నిర్ణయాల వల్లే అకున్ సభర్వాల్ అప్పట్లో ప్రజల హృదయాల్లో ఒక 'రియల్ హీరో'గా నిలిచారు.

## కేంద్రసర్వీసులకు...

డాక్టర్ అకున్ సభర్వాల్ వంటి నిక్కచ్చి మరియు సమర్థుడైన అధికారిని కేంద్ర సర్వీసులకు పంపడం వెనుక పరిపాలనాపరమైన నిబంధనలు, జాతీయ భద్రతా అవసరాలు మరియు కొన్ని రాజకీయ, సామాజిక సమీకరణాలు ఉన్నాయి. ఐఏఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసుల ని బంధనల ప్రకారం.. ప్రతి అధికారి తన కెరీర్‌లో నిర్దిష్ట కాలం పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలలో (రా అండ్ డబ్ల్యూ, ఐబీ, ఐటీబీపీ, సీబీఐ వంటివి) విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అకున్ సభర్వాల్ గారు 2001 బ్యాచ్ అధికారి. సీనియర్ స్థాయిలో ప్రమోషన్లు పొందడానికి మరియు జాతీయ స్థాయి రక్షణ వ్యవస్థల్లో అనుభవం గడించడానికి ఈ కేంద్ర డిప్యుటేషన్ ఒక సాధారణ మరియు తప్పనిసరి ప్రక్రియ. అకున్ సభర్వాల్ గారికి క్షేత్రస్థాయిలో తీవ్రవాద నిరోధక చర్యలు, నిఘా మరియు మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లను ఛేదించడంలో అసాధారణమైన ట్రాక్ రికార్డ్ ఉంది. ఇటువంటి సమర్థులైన అధికారుల సేవలు దేశ రక్షణకు అవసరమని భావించి, కేంద్ర ప్రభుత్వం ఆయనను 'రా' మరియు ఐటీబీపీ (ఐటీబీపీ–ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్) వంటి అత్యున్నత రక్షణ మరియు ఇంటెలిజెన్స్ విభాగాల్లో ఐజీగా కీలక బాధ్యతల్లో నియమించింది. 2017లో హైదరాబాద్‌ను కుదిపేసిన టాలీవుడ్ డ్రగ్స్ కేసును విచారిస్తున్న సమయంలో అకున్ సభర్వాల్ గారికి అంతర్జాతీయ డ్రగ్ మాఫియా నుండి తీవ్రమైన బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఆయన కు టుంబ సభ్యులను కూడా టార్గెట్ చేస్తూ బెదిరింపులు రావడంతో, ఒక నిజాయితీ గల అధికారికి మరియు ఆయన కుటుంబానికి పూర్తి స్థాయి రక్షణ కల్పించడంతో పాటు, కొంతకాలం పాటు ఇక్కడి స్థానిక వాతావరణం నుండి మార్పు అవసరమని భావించి కేంద్ర సర్వీసులకు పంపారనే ప్రచారం కూడా ఉంది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా మరియు సివిల్ సప్లైస్ కమిషనర్‌గా ఉన్నప్పుడు అకున్ సభర్వాల్ అవినీతిపై ఉక్కుపాదం మోపారు. డ్రగ్స్ కేసులో అగ్రశ్రేణి సినీ ప్రముఖులు, రాజకీయ నేపథ్యం ఉన్నవారిని విచారించడంతో అప్పటి అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది. ఇంతటి నిక్కచ్చి అధికారి రాష్ట్రంలో ఉంటే తమ ప్రయోజనాలకు ఇబ్బంది కలుగుతుందని భావించిన కొందరు పెద్దలు, వ్యూహాత్మకంగా ఆయనను కేంద్ర డిప్యుటేషన్‌కు వెళ్లేలా తెరవెనుక ఒత్తిడి తెచ్చారనే విమర్శలు కూడా రాజకీయ విశ్లేషకుల్లో ఉన్నాయి.

## కేంద్ర సర్వీసుల్లో సాధించిన విజయాలు

డాక్టర్ అకున్ సభర్వాల్ కేంద్ర సర్వీసుల్లో గడిపిన సుదీర్ఘ కాలంలో దేశ భద్రత మరియు సరిహద్దుల రక్షణ విభాగాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన బాధ్యతలను నిర్వహించారు. దేశంలోనే అ త్యున్నత మరియు ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అయిన రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) లో ఆయన ఐజీగా సేవలు అందించారు. అంతర్జాతీయంగా దేశ భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై ని ఘా పెట్టడం, అంతర్గత రక్షణకు సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించి విశ్లేషించడంలో ఆయన తనదైన శైలిలో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఆయన అందించిన విశేషమైన సేవల కు గాను 2020లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రతిష్టాత్మకమైన 'ఇండియన్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్' బహూకరించి గౌరవించింది. భారత–చైనా సరిహద్దులను రక్షించే అ త్యంత కఠినమైన పారామిలటరీ బలగం ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) లో ఆయన ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) గా సుదీర్ఘకాలం పనిచేశారు. ఐటీబీపీలో భాగంగా ఆయన అత్యంత వ్యూహాత్మకమైన మరియు సున్నితమైన ఈశాన్య సరిహద్దు విభాగానికి ఐజీగా బాధ్యతలు చేపట్టారు. చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు ఉన్న ఈ ప్రాంతంలో బలగాలను సమర్థవంతంగా నడిపించడంలో ఆయన నాయకత్వ పటిమ కనబరిచారు. మైనస్ డిగ్రీల చలి, మంచు తుఫానులు ఉండే హిమాలయ పర్వత ప్రాంత సరిహద్దుల్లో నిరంతరం పర్యటిస్తూ, అక్కడ విధులు నిర్వహించే జవాన్లలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. వఅత్తిరీత్యా ఆయనకు ఉన్న పర్వతారోహణ నైపుణ్యాలు ఈ సరిహద్దు విధుల్లో ఎంతో ఉపయోగపడ్డాయి. కేంద్ర సర్వీసుల్లో ఉన్న కాలంలో కేవలం సరిహద్దుల రక్షణకే పరిమితం కాకుండా, దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో నూ, కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు వివిధ వ్యూహాత్మక కమిటీలలో కీలక సభ్యుడిగా ఉంటూ దేశ రక్షణ విధానాల రూపకల్పనలో భాగస్వామ్యమయ్యారు. అంతర్జాతీయ నిఘా సంస్థలలో (రా), అత్యంత ప్రమాదకరమైన సరిహద్దుల్లో (ఐటీబీపీ) సుమారు ఆరేళ్లకు పైగా దేశానికి సేవ చేసిన అపార అనుభవంతో ఆయన ఇప్పుడు తిరిగి మన తెలంగాణ క్యాడర్‌కు చేరుకున్నారు. ఈ జాతీయ స్థాయి అనుభవం రాబోయే రోజుల్లో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు మరియు అసాంఘిక శక్తుల అణచివేతకు ఎంతగానో దోహదపడనుంది.




22ND ANNIVERSARY
నేటిధాత్రి ®
తెలుగు వార్తా పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

శుక్రవారం 16-10-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 176 రూ॥ 6.00








# రైతు డిస్కం ముంచడానికా? తేల్చడానికా?




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘువేందర్ రావ్
9063524136, 9908658888


- దేశంలోనే మొదటిసారి ఏర్పాటు
- ఉచిత విద్యుత్‌కు మంగళం పాడటానికే: బిఆర్ఎస్
- నాణ్యమైన విద్యుత్ అందించడానికి: ప్రభుత్వం
- కొత్తసంస్థపై తొలిరోజే రూ.46,126 కోట్ల అప్పుల భారం
- థర్మల్ విద్యుత్ 25% మాత్రమే కేటాయింపులో మతలబేంటి?
- రాత్రి వుండని సోలార్ విద్యుత్ వాటా 58శాతమా!!

- 30.63 లక్షల కనెక్షన్లకు రెండువేల సిబ్బంది మాత్రమే!
- సీజన్‌లో 3-4 నెలలు మాత్రమే వుండే జలవిద్యుత్‌కు 17%!
- ఒకేసారి రైతులు మోటార్లు వేస్తే గ్రిడ్ తట్టుకోగలదా?
- క్రమంగా ఉచితవిద్యుత్‌ను ఎత్తేసే ప్రణాళిక: విపక్షాలు
- ఆదాయం లేని సంస్థపై రూ.46,126కోట్ల రుణభారం మోపడమేంటి?

## • ఆదాయం కోసం రైతుల మోటర్లకు మీటర్లు పెట్టే అవకాశం: విపక్షాలు • పై ఆరోపణలను ఖండిస్తున్న ప్రభుత్వం

**హైదరాబాద్, నేటిధాత్రి:**
తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మూడో విద్యుత్ పంపిణీ సంస్థగా తెలంగాణ రైతు పవర్ డిస్ట్రి బ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఆర్‌పీడీసీఎల్)లేదా 'రైతు డిస్కం'ను అధికారికంగా ఏర్పాటు చే సింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 17ను కూడా విడుదల చేసింది. వ్యవసాయం మరియు గ్రామీణ నీటి సరఫరా అవసరాల కోసం ప్రత్యేకంగా ఒక డిస్కమ్‌ను ఏర్పాటు చేయడం దేశంలోనే ఇదే తొలిసారి. ఈ నిర్ణయంపై రాష్ట్రంలో రాజకీయంగా, సామాజికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఉత్తర (టీజీఎన్‌పీడీసీఎల్), దక్షిణ (టీజీఎస్‌పీడీసీఎల్) డిస్కమ్‌ల పరిధిలోని దాదాపు 30.63 లక్షల కనెక్షన్లను ఈ కొత్త రైతు డిస్కం కిందికి బదిలీ చేశారు. ఇం దులో 30.60 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉండగా, మిగిలినవి ఎత్తిపోతల పథకాలు (లిఫ్ట్ ఇరిగేషన్), మిషన్ భగీరథ మరియు వాటర్ బోర్డు కనెక్షన్లు. పాత డిస్కమ్‌ల నుంచి రూ.46,155 కోట్ల విలువైన ఆస్తులను, అలాగే రూ.46,126 కోట్ల అప్పులను కూడా ఈ కొత్త రైతు డిస్కం ఖా తాలోకి బదిలీ చేశారు. ఈ సంస్థ నిర్వహణ కోసం ప్రాథమికంగా దాదాపు 2,000 మంది సి బ్బందిని (ఇంజనీర్లు, ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్ సిబ్బంది, ఆర్టిజన్లు) కేటాయించారు.

### రైతులకు లాభమా నష్టమా

ఈ పథకంపై ప్రభుత్వం చెప్తున్న లాభాలు ఒకవైపు ఉంటే, ప్రతిపక్షాలు మరియు విద్యుత్ నిపుణులు వ్యక్తపరుస్తున్న ఆందోళనలు (నష్టాలు) మరోవైపు ఉన్నాయి. గృహ, పారిశ్రామిక విద్యుత్ అవసరాల నుంచి వ్యవసాయాన్ని వేరు చేయడం వల్ల రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను అందించడం సులువవుతుందని ప్రభుత్వం చెబుతోంది. రైతు డిస్కం ఏర్పాటు చేసినా రైతులకు ఉచిత విద్యుత్ యథావిధిగా కొనసాగుతుందని, మోటర్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)స్పష్టం చేసింది. వ్యవసాయ రంగానికి కేటాయించిన 6.15 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షించవచ్చు. బీఆర్ఎస్, ఇతర నిపుణుల వాదన భిన్నంగా వుంది. భవిష్యత్తులో రైతులకు ఉచిత విద్యుత్‌ను దూరం చేయడానికి లేదా పరిమితులు విధించడానికి ఈ ప్రత్యేక డిస్కం ఒక సాధనంగా మారే ప్ర మాదం ఉందని ప్రతిపక్ష నేత హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన సంస్థపైనే మొదటిరోజే రూ.46,126 కోట్ల అప్పుల భారం మోపారు. ఈ ఆర్థిక నష్టాలను సాకుగా చూపి భవిష్య త్తులో సబ్సిడీలను తగ్గించవచ్చనే ఆందోళన ఉంది. 30 లక్షలకు పైగా కనెక్షన్లు, 6 లక్షల ట్రాన్స్‌ఫార్మర్ల భారీ నెట్‌వర్క్‌ను కేవలం 2,000 మంది సిబ్బందితో నిర్వహించడం అసాధ్యమని, దీనివల్ల రేపు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే సకాలంలో బాగుచేసే నాథుడుండడని విమర్శలు వస్తున్నాయి. ఈ కొత్త డిస్కమ్‌కు కేవలం 25% థర్మల్ విద్యుత్‌ను, మిగిలిన ఎక్కువ భాగం సోలార్, జల వి ద్యుత్‌ను కేటాయించారు. సోలార్ రాత్రి పూట రాదు, జల విద్యుత్ ఏడాదిలో 3-4 నెలలు మా త్రమే ఉంటుంది. దీనివల్ల రైతులకు రాత్రి వేళల్లో కరెంట్ కోతలు వచ్చే ప్రమాదం ఉందనే అ నుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ప్రకటనల ప్రకారం చూస్తే ఇది వ్యవసాయానికి ప్రత్యేక సేవలందించే లాభదాయక నిర్ణయంలా కనిపిస్తున్నప్పటికీ... భారీ అప్పుల బదిలీ, సిబ్బంది కొరత మరియు విద్యుత్ కేటాయింపుల్లో లోపాల వల్ల భవిష్యత్తులో రైతులకు నష్టాలు లేదా ఇబ్బందులు ఎదురయ్యే ముప్పు ఉందనేఆందోళనలు బలంగా ఉన్నాయి. ప్రభుత్వం ఈ ఆందోళనలపై స్పష్టమైన లిఖితపూర్వక హామీ ఇ స్తేనే రైతుల్లో నమ్మకం కలుగుతుంది.

### ఉచిత విద్యుత్‌ను ఎత్తేసే కుట్ర వున్నదా?

రైతు డిస్కమ్‌కు కేటాయించిన కరెంట్‌లో 58% సోలార్ (సౌర విద్యుత్), 17% హైడల్ (జల విద్యుత్) ఉన్నాయి, కేవలం 25% మాత్రమే థర్మల్ విద్యుత్ కేటాయించారు. సోలార్ విద్యుత్ కేవలం పగటిపూట మాత్రమే వస్తుంది. జల విద్యుత్ ఏడాదిలో కేవలం 3 నుండి 4 నెలలు (వర్షా కాలంలో) మాత్రమే అందుబాటులో ఉంటుంది. మిగిలిన సమయాల్లో మరియు రాత్రి వేళల్లో రైతులకు కరెంట్ ఎలా ఇస్తారు? దీనివల్ల భవిష్యత్తులో రైతులకు ఉచిత విద్యుత్‌ను కేవలం పగటిపూట 6-7 గంటలకే పరిమితం చేసే ప్రమాదం ఉందన్నది విపక్షాల ప్రధాన ఆరోపణ. కొత్త డిస్కమ్‌కు రూ.46,126 కోట్ల అప్పులను బదిలీ చేశారు. కేవలం వ్యవసాయ కనెక్షన్లు మాత్రమే ఉండే ఈ డిస్కమ్‌కు ఎలాంటి స్వంత ఆదాయం ఉండదు (రైతుల నుంచి బిల్లులు వసూలు చే యరు కాబట్టి). రేపు ప్రభుత్వం సకాలంలో సబ్సిడీ నిధులు విడుదల చేయకపోతే, ఈ సంస్థ నష్టాల్లో మునిగిపోతుంది. ఆ నష్టాలను సాకుగా చూపి ఉచిత విద్యుత్‌కు మంగళం పాడుతారనేది ప్రతిపక్షాల వాదన. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ప్రకారం వ్యవసాయ మోటర్లకు స్మార్ట్/ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలనే ప్రతిపాదన ఉంది. ప్రత్యేక డిస్కం ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో మీటర్లు పెట్టి ఉచిత విద్యుత్‌ను రద్దు చేయడానికి ప్రైవేట్ సంస్థలకు (ఉదా హరణకు అదానీ వంటి సంస్థలకు) విద్యుత్ రంగాన్ని అప్పగించే వీలుంటుందని కేటీఆర్ వంటి నేతలు గతంలోనే ఆరోపించారు. ఈ ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం మరియు విద్యుత్ నియం త్రణ మండలి (టీజీఈఆర్సీ)తీవ్రంగా ఖండించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు విద్యుత్ శాఖ అధికారులు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెడతామనేది కేవలం ప్రతిపక్షాల అపోహ మాత్రమేనని, రైతులకు భారం పడేలా ఎలాంటి మీటర్లు బిగించబోమని సీఎం స్పష్టం చేశారు. రైతు డిస్కమ్‌కు అయ్యే విద్యుత్ కొనుగోలు ఖర్చులు, సబ్సిడీ భారాన్ని బడ్జెట్ ద్వారా పూర్తిగా ప్రభుత్వమే భరి స్తుందని, సంస్థ అప్పుల వల్ల రైతులకు ఎలాంటి నష్టం రాదని ప్రభుత్వం చెబుతోంది. రాజకీయంగా ఉచిత విద్యుత్ అనేది తెలంగాణలో అత్యంత సున్నితమైన అంశం. ఏ ప్రభుత్వం కూడా దీన్ని నేరుగా రద్దు చేసే సాహసం చేయలేదు. అయితే, ప్రతిపక్షాలు సాంకేతిక అంశాలను (విద్యుత్ కేటాయింపులు, సిబ్బంది కొరత, అప్పులు) చూపిస్తూ అనుమానాలు వ్యక్తం చేస్తుండ గా... ప్రభుత్వం మాత్రం ఇది కేవలం రైతుల మేలు కోసం చేసిన పాలనాపరమైన సంస్కరణ మాత్రమేనని అంటోంది. దీనిపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇస్తేనే రైతుల్లో ఉన్న అనుమానాలు పూర్తిగా పటాపంచలవుతాయి.

### తొలిరోజే డిస్కంపై రూ. 46,126 కోట్ల అప్పుల భారం

రైతు డిస్కంపై మొదటి రోజే రూ. 46,126 కోట్ల అప్పుల భారాన్ని మోపడం ఇప్పుడు రాష్ట్రంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఇదివరకు ఉన్న రెండు డిస్కమ్‌ల (ఉత్తర, దక్షిణ డిస్కమ్‌లు) మొత్తం అప్పుల్లో నుంచి... వ్యవసాయం, ఎత్తిపోతల పథకాలకు (లిఫ్ట్ ఇరిగేషన్) సంబంధించిన వాటాను లెక్కగట్టి, ఈ రూ. 46,126 కోట్ల అప్పును కొత్తగా ఏర్పడిన రైతు డిస్కం (టీజీఆర్‌పీడీసీఎల్) ఖాతాలోకి బదిలీ చేశారు. సాధారణ డిస్కమ్‌లకైతే ఇ ళ్లు, దుకాణాలు, ఫ్యాక్టరీల నుంచి కరెంట్ బిల్లుల రూపంలో ఆదాయం వస్తుంది. కానీ, రైతు డిస్కమ్‌లో కేవలం వ్యవసాయ కనెక్షన్లు (ఉచితం) మరియు ప్రభుత్వ నీటి సరఫరా కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి. అంటే ఈ సంస్థకు స్వంత ఆదాయం సున్నా. ఈ సంస్థ మనుగడ సాగించాలన్నా, ఈ రూ. 46,126 కోట్లఅప్పుకు వడ్డీలు కట్టాలన్నా, కొత్తగా విద్యుత్ కొనాలన్నా... వందకు వంద శాతం ప్రభుత్వం ఇ చ్చే నిధులు (సబ్సిడీల) పైనే ఆధారపడాలి. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నుంచి ఈ డిస్కమ్‌కుసకాలంలో నిధులు విడుదల చేయకపోతే, సంస్థ మరింత అప్పుల్లో కూరుకుపోతుంది. ఫలితంగా విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు (జెన్‌కో) బకాయిలు చెల్లించలేక, రైతులకు ఇచ్చే కరెంట్‌లో కోతలు పెట్టే పరిస్థితి రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంత భారీ అప్పులతో ఉన్న ప్రభుత్వ సంస్థ నష్టాల్లోకి వెళ్తే, భవిష్యత్తులో "నిర్వహణ భారం" సాకుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ లేదా కా ర్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రమాదం ఉందనేది ప్రతిపక్షాల (బీఆర్ఎస్) ప్రధాన ఆరోపణ. ఈ అప్పుల భారం కేవలం కాగితాల వరకేనని, రైతులపై దీని ప్రభావం పడబోదని ప్రభుత్వం చెబుతోంది. పాత డిస్కమ్‌ల భారాన్ని తగ్గించి, వ్యవసాయ రంగానికి అయ్యే ఖర్చులను బడ్జెట్‌లో విడిగా కేటాయించి నేరుగా రైతు డిస్కమ్‌కు చెల్లించడానికే ఈ విభజన చేశామని, ప్రభుత్వమే ఈ అప్పుల బాధ్యతను మోస్తుందని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

### సిబ్బంది కొరత

రైతు డిస్కం (టీజీఆర్‌పీడీసీఎల్) ఏర్పాటులో 'సిబ్బంది కొరత' అనేది అత్యంత వివాదాస్పదమైన మరియు సాంకేతికంగా సంక్లిష్టమైన అంశంగా మారింది. దాదాపు 30 లక్షలకు పైగా కనెక్షన్లు ఉన్న ఈ భారీ వ్యవస్థను నిర్వహించడానికి ప్రభుత్వం కేటాయించిన సిబ్బంది సంఖ్య చాలా త క్కువగా ఉందనే విమర్శలు బలంగా వినిపిస్తు న్నాయి. దాదాపు 30.63 లక్షలు (ఇందులో 30.60 లక్షల వ్యవసాయ కనెక్షన్ల తో పాటు మిషన్ భగీరథ, ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి). రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లోని 584 మండలాల పరిధిలో విస్తరించి ఉన్న 6,15,651 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు), అలాగే 2.51 లక్షల కిలోమీటర్ల పొడవైన ఎల్టీ లైన్లు ఈ డిస్కం పరిధిలోకి వస్తాయి. ఈ మొత్తం వ్యవస్థను పర్యవేక్షించడానికి ప్రభుత్వం ప్రాథమికంగా కేవలం 2,000 మంది సిబ్బందిని మాత్రమే కేటాయించింది. ఇందులో ఫీల్డ్ లెవెల్‌లో పనిచేసే లైన్‌మెన్లు, ఆర్టిజన్లు దాదాపు 1,000 మంది మాత్రమే ఉంటారని తెలుస్తోంది. సగటున లెక్కిస్తే, ఒక్కో మండలానికి కేవలం 3 నుండి 4 గురు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉంటారు. ఒకే మండలంలో వేల సంఖ్యలో ఉండే మోటర్లు, వందల ట్రాన్స్‌ఫార్మర్లను ఇంత తక్కువ మందితో పర్యవేక్షించడం అసాధ్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో లేదా ఎండకాలంలో లోడ్ ఎక్కువై వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, వైర్లు తెగిపోవడం సర్వసాధారణం. సిబ్బంది కొరత వల్ల వాటిని సకాలంలో పునరుద్ధరించడం కష్టమవుతుంది. దీనివల్ల రైతులు రోజుల తరబడి చీకట్లోనే ఉండాల్సి వస్తుంది, పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. 33 కెవి, 11 కెవి సబ్‌స్టేషన్లుమరియు లైన్లు పాత డిస్కమ్‌ల (ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్)పరిధిలోనే ఉంటాయి. కేవలం వ్యవసాయ లైన్లు మాత్రమే కొత్త డిస్కం పరిధిలోకి వస్తాయి. ఈ రెండు డిస్కమ్‌ల మధ్య సమన్వ యం లోపిస్తే క్షేత్రస్థాయిలో సమస్యలు వచ్చినప్పుడు ఎవరు బాధ్యత వహిస్తారనేది పెద్ద ప్రశ్న.

### ఉద్యోగులనుంచి వ్యతిరేకత

మరోవైపు పాత డిస్కమ్‌ల నుండి కొత్త రైతు డిస్కమ్‌కు బదిలీ కావడానికి ఇంజనీర్లు, ఇతర సిబ్బంది సుముఖంగా లేరని, ప్రమోషన్లు లేదా బదిలీల విషయంలో తమ సేవా నిబంధనలు దెబ్బతింటాయనే ఆందోళనతో వారు బదిలీలను వ్యతిరేకిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ సవాళ్లపై రైతు డిస్కం యాజమాన్యం స్పందిస్తూ... ప్రారంభంలో కార్యకలాపాలు సజావుగా సాగడానికి ఈ 2,000 మందిని తాత్కాలికంగా కేటాయించామని పేర్కొంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్‌కో, జెన్‌కోల నుండి సిబ్బందిని పెంచుకుంటామని, అవసరమైతే కొత్త నియామకాలు లేదా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఫీల్డ్ స్టాఫ్‌ను నియమించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రభుత్వం తరపున అధికారులు చెబుతున్నారు.

### విద్యుత్ కేటాయింపులో లోపాలు

రైతు డిస్కమ్‌కు జరిగిన విద్యుత్ కేటాయింపుల్లో లోపాల కారణంగా భవిష్యత్తులో రైతులకు తీవ్ర విద్యుత్ కొరత ముప్పు పొంచి ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొత్త రైతు డిస్కమ్‌కు ప్రభుత్వం నిర్దేశించిన కరెంట్ వాటా సౌర విద్యుత్ గరిష్టంగా 58%, జల విద్యుత్ 17%, థర్మల్ విద్యుత్ కేవలం 25% చొప్పున వుంది. సౌర విద్యుత్ (58%) కేవలం పగటిపూట మాత్రమే వస్తుంది. రాత్రి వేళల్లో సోలార్ పవర్ పూర్తిగా సున్నా అవుతుంది. వ్యవసాయానికి కేవలం పగటిపూటే కాకుండా రాత్రి పూట కూడా కరెంట్ అవసరమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం థర్మల్ విద్యుత్ సామర్థ్యం 13,096 మెగావాట్లు ఉంటే, రైతు డిస్కమ్‌కు కేటాయించింది కేవలం 3,306 మెగావాట్లు (అంటే కేవలం 25.24%) మాత్రమే. దీనికి భిన్నంగా, రైతు డిస్కమ్‌కు ఏకంగా 5,031 మెగావాట్ల సోలార్ పవర్ (58%) మరియు రాష్ట్రంలో ఉన్న మొత్తం 2,324.8 మెగావాట్ల జల విద్యుత్ సామర్థ్యాన్ని (100% హైడల్) కేటాయించారు. రాత్రి వేళల్లో 58% విద్యుత్‌అందుబాటులో లేనప్పుడు రైతులకు కరెంట్ కోతలు పెట్టక తప్పదనేది నిపుణుల హెచ్చరిక. జల విద్యుత్ (17%) కేవలం వర్షాకాలంలో (3-4 నెలలు) రిజర్వాయర్లలో నీరు ఉన్నప్పుడు మాత్ర మే ఉత్పత్తి అవుతుంది. ఎండకాలంలో జల విద్యుత్ దాదాపు అందుబాటులో ఉండదు. ఎండకాలంలోనే పంటలకు నీటి అవసరం (డిమాండ్) గరిష్టంగా ఉంటుంది. ఆ సమయంలో ఈ 17% విద్యుత్ లోటును ఎలా భర్తీ చేస్తారనేది పెద్ద ప్రశ్న. నిరంతరాయంగా (బేస్ లోడ్) విద్యుత్‌ను అందించే థర్మల్ పవర్ వాటాను కేవలం 25% కే పరిమితం చేశారు. సాధారణంగా రాష్ట్రంలోని మిగిలిన రెండు డిస్కమ్‌లు (ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్)తమ అవసరాల కోసం 53.28% థర్మల్ విద్యుత్‌పై, కేవలం 35.31% సోలార్ విద్యుత్‌పై ఆధారపడుతుంటాయి. కానీ రైతు డిస్కమ్ కు మాత్రం దీనికి పూర్తిగా రివర్స్‌లో కేటాయింపులు జరిగాయి. మిగిలిన రెండు సాధారణ డిస్కమ్‌లకు (ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్)ఎక్కువ మొత్తంలో నమ్మకమైన థర్మల్ కరెంట్‌ను కేటా యించి, రైతు డిస్కమ్‌కు మాత్రం అస్థిరమైన పునరుత్పాదక ఇంధనాన్ని కేటాయించడం క్షేత్రస్థాయిలో సమస్యలకు దారితీస్తుందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

### గ్రిడ్ స్థిరత్వ సమస్యలు

వ్యవసాయ మోటర్ల లోడ్ ఒక్కసారిగా పెరిగినప్పుడు గ్రిడ్ స్థిరంగా ఉండాలి. సోలార్, హైడల్ విద్యుత్ వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి (మబ్బులు పట్టినా, నీటి ప్రవాహం తగ్గినా ఉత్పత్తి పడిపోతుంది). ఇలాంటి అస్థిర విద్యుత్‌పై 30 లక్షల మోటర్ల భారాన్ని వేయడం వల్ల గ్రిడ్ ఫెయిల్యూర్స్ లేదా లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తి రైతుల మోటర్లు కాలిపోయే ప్రమాదం ఉందని సాంకేతిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ఈ ముప్పును అధిగమించడానికి 'పగటిపూట మాత్రమే 24 గంటల వ్యవసాయ విద్యుత్' లేదా షిఫ్టుల పద్ధతిని పక డ్బందీగా అమలు చేయాలని భావిస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రీన్ ఎనర్జీ (సౌర, జల విద్యుత్) వాటాను పెంచడం ద్వారా పర్యావరణ హితంగా మరియు తక్కువ ఖర్చుతో రైతులకు కరెంట్ అందించవచ్చని, లోటు వచ్చినప్పుడు ఇతర డిస్కమ్‌ల నుండి కరెంట్ కొనుగోలు చేసేలా ఒప్పందాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

### సాంకేతిక, క్షేత్రస్థాయి సమస్యలు

సోలార్ పవర్ (58%) కేవలం పగటిపూట మాత్రమే లభిస్తుంది. రాత్రి కాగానే ఈ 58% విద్యుత్ పూర్తిగా నిలిచిపోతుంది. వ్యవసాయానికి రాత్రి పూట కూడా కరెంట్ అవసరమైనప్పుడు, ఇంత పెద్ద లోటును కేవలం 25% థర్మల్ విద్యుత్‌తో భర్తీ చేయడం అసాధ్యమని నిపుణులు చెబు తున్నారు. 100% కేటాయించిన జల విద్యుత్ (17% వాటా) కేవలం వర్షాకాలంలో (ఏడాదికి 3-4 నెలలు) మాత్రమే పూర్తిస్థాయిలో వస్తుంది. ఎండకాలంలో చెరువులు, రిజర్వాయర్లు ఎండిపోయినప్పుడు జల విద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఆ సమయంలోనే రైతులకు కరెంట్ డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది. సోలార్, హైడల్ విద్యుత్‌లు వాతావరణంపై ఆధారపడి అస్థిరంగా ఉంటాయి. 30 లక్షలకు పైగా వ్యవసాయ మోటర్లు ఒకేసారి ఆన్ చేసినప్పుడు గ్రిడ్ స్థిరంగా ఉండాలంటే నిరంతరాయంగా వచ్చే థర్మల్ విద్యుత్ ఎక్కువ ఉండాలి. థర్మల్ వాటా తక్కువగా ఉండటం వల్ల లో-వోల్టేజ్ సమస్యలు రావచ్చు.

### హరీష్‌రావు ఆరోపణలు

"కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, ఈ వ్యూహాత్మక కేటాయింపుల ద్వారా ఆ పథకాన్ని నీరుగారుస్తోంది. నమ్మకమైన థర్మల్ పవర్‌ను పక్కనపెట్టి, రాత్రి పూట రాని సోలార్ కరెంట్‌ను రైతులకు కేటాయించడం ద్వారా భవిష్యత్తులో రైతులకు ఉచిత విద్యుత్‌ను కేవలం పగటిపూట 6 నుండి 7 గంటలకే పరిమితం చేయాలని చూస్తోందని హరీష్‌రావు రోపించారు. ఈ ఆరోపణకు ప్రభుత్వ వర్గాలు సాంకేతికపరంగా సమాధానం చెబుతున్నాయి. సోలార్ పవర్‌ను రాత్రి పూట కూడా వాడుకోవడానికి ప్రభుత్వం ఇప్పటికే పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. ఇటీవలే 3,000 మెగావాట్ల సోలార్ పవర్తో పాటు, రాత్రి పూట వాడుకోవడానికి వీలుగా 6,000 ఎండబ్ల్యుహెచ్ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) కోసం టెండర్లను కూడా ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునరుత్పాదక ఇంధన వాటాను పెంచడం ద్వారా విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. కరెంట్ కొరత ఏర్పడిన రోజుల్లో ఓపెన్ మార్కెట్ నుండి లేదా ఇతర డిస్కమ్‌ల నుండి కరెంట్ కొనుగోలు చేసేలా అంతర్గత ఒప్పందాలు ఉంటాయని, రైతులకు 24 గంటల సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండదని అధికారులు భరోసా ఇస్తున్నారు. కాగితం మీద చూస్తే 25% థర్మల్ బేస్ లోడ్ అనేది వ్యవసాయ రంగానికి చాలా తక్కువ. అయితే, ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను గనుక గ్రిడ్‌కు అనుసంధానిస్తే ఈ కొరతను అధిగమించవచ్చు. అలా కాకుండా కేవలం పాత పద్ధతిలోనే నడిపితే మాత్రం ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నట్టుగా రాత్రి వేళల్లో కరెంట్ కోతలు వచ్చే ముప్పు స్పష్టంగా కనిపిస్తోంది.




# నేటిధాత్రి

22nd ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

శుక్రవారం 16-10-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 176 రూ॥ 6.00




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888






## తమిళనాడు మీద తల్లి ప్రేమ.. తెలంగాణ మీద సవతి పగ!?



# కుప్పం పండాలి..చెన్నై నిండాలి..
# తెలంగాణ ఎండాలి!?

- ఎన్నికలొచ్చినప్పుడల్లా శంకుస్థాపనలు చేసి ప్రజలను మాయ చేశారు.
- మద్రాస్ గొంతెండుతుందంటే ఆగమేఘాల మీద తెలుగు గంగ తవ్వారు.
- మద్రాస్ కు మంచినీళ్లు ఇచ్చి గొప్పలు చెప్పుకున్నారు.
- మద్రాస్ ఋణం తీర్చుకున్నారు.
- అప్పుడు ఎన్టీఆర్ కాలంలో అలా అన్యాయం చేశారు.
- ఇప్పుడు గోదావరి, కావేరి అనుసంధానం అని చంద్రబాబు అంటున్నారు.
- తెలంగాణ కు గోదారిలో చుక్క నిరిచ్చేందుకు నై నై అన్నారు.
- తెలుగు జాతి మనది అని మభ్యపెట్టి మోసం చేశారు.
- మిగులు జలాలైన ఇచ్చేందుకు చంద్రబాబుకు మనసే రాలేదు.
- ఇప్పుడు చెన్నై కి గోదారి పంపిందుకు సిద్ధమౌతున్నారు.
- తెలంగాణ లో వుంటారు. తెలంగాణ లో రాజకీయాలు చేస్తారు.
- తెలంగాణ నీళ్ల కోసం తండ్లడుతుంటే పట్టించుకోరు.
- తమిళనాడు మీద మమకారం చంపుకోలేరు.

### •ఇది తెలంగాణపై చంద్రబాబు వైఖరి?

### •గోదావరి, కావేరి నదుల అనుసంధానమట!?

### •తడి ఆరి తెలంగాణ ఎడారై తల్లడిల్లు తుంటే 60 ఏళ్ళు చూసారు.

### •తెలంగాణకు చుక్క నీళ్ళివ్వడానికి మనసు రాలేదు.

## తెలంగాణ మీద కోపం చల్లార్చుకోలేరు.

### •కాళేశ్వరం కడుతుంటే అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు.

### •కర్ణాటక, తమిళనాడు మధ్య వున్న విబేధాలు తెలంగాణ కు ముడి పెట్టాలని చూస్తున్నారు.

### •పోలవరం నుంచి, పట్టిసీమ నింపుకుంటున్నారు.

### •అక్కడి నుంచి బనకచర్ల ( నల్ల మల సాగర్) నింపుకొనే ఎత్తుగడ ఇప్పటికే వేశారు.

### •అక్కడినుంచి ఏపీ లో వున్న రిజర్వాయర్లు నింపుకుంటూ తమిళనాడు కు నీళ్లు తరలిస్తారు.

### •కావేరి నదిని సజీవం చేస్తుంటారు.

### •తెలంగాణ ఏమై పోవాలన్నదాని గురించి చంద్రబాబు పట్టించుకోరు?

### •తెలంగాణ మేధావులు ఏం చేస్తున్నారు?

### •తెలంగాణ ఉద్యమ కారులు నోరెందుకు తెరవడం లేదు!

**హైదరాబాద్, నేటిధాత్రి:**

అరవై ఏళ్లు కలిసున్నా తెలంగాణ మీద ఏ కోశాన ఆంద్రా పాలకులకు ప్రేమ కలగలేదన్నదిమరోసారి రుజువైంది? అందుకే తెలంగాణ ప్రజలు మా రాష్ట్రం మాకు కావాలి. మా పాలన మాకు కావాలి. మా బతుకులు మేం బతుకుతాం. మమ్మల్ని మేం పాలించుకుంటామని పోరాటం ఎందుకు చేశారో తాజాగా ఏపి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంతో మరోసారి తేలిపోయింది. 1983లో ఎన్టీఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి, తమిళనాడుకు ఎన్‌జీ రామచంద్రన్ ముఖ్యమంత్రి. తమిళనాడుకు మంచి నీటి అవసరాల కోసం ఏపిని కోరింది. 15టిఎంసిలు కావాలని కోరడం జరిగింది. తమిళనాడు ప్రభుత్వం అడిగిందే తడువుగా ఆనాడు ఎన్టీ రామారావు తెలుగుగంగ కాలువ మొదలు పెట్టారు. 15 నెలల్లో పూర్తి చేసి తమిళనాడుకు మంచినీళ్లు అందించారు. తలాపున అటు కృష్ణా, ఇటు గోదావరి పారుతున్న గుక్కెడు మంచి నీళ్ల కోసం గోసపడుతున్న తెలంగాణ కోసం ఆలోచించలేదు. కాని తమిళనాడు కోసం అనగానే క్షణం ఆలోచించకుండా నిర్ణయం తీసుకున్నారు. నీళ్లిచ్చారు. ఇప్పుడు ఏకంగా ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు గోదావరి, కావేరి నదులు అనుసందానం ముందు పెట్టుకున్నారు. ఎక్కడి గోదావరి, ఎక్కడి కావేరి నది అయినా తమిళనాడు మీద ప్రేమ చూపించడానికి తపన పడుతున్నారు. దీనినే ఐన వారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. గోదావరి, కావేరిల అనుసందానం కోసం విజయవాడను వేదిక చేసుకొని, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశయ్యారు. తెలంగాణకు చుక్క నీరు లేకున్నా ఫరవాలేదనుకంటున్నారు? ఎగువ రాష్ట్రాలకన్నా, దిగువ రాష్ట్రాలకు వుండే నీటి హక్కుల మీద రాజకీయం చేయాలని చూస్తున్నారు. నీళ్లు అనేవి జాతీయ సమస్యే కావొచ్చు. కాని తెలంగాణ ఎండుతుంటే కూడా తమిళనాడుకు నీళ్లిస్తామని చెప్పడం ఏకంగా నదులే అనుసంధానం చేస్తామని మాట్లాడుకోవడంలో ఆంతర్యమేమిటి? నదుల అనుసంధానం తప్పు కాదు. మంచినీళ్లు సముద్రంలో కలువకుండా ఉపయోగించుకోవడం అసలే తప్పు కాదు. గోదావరి నీళ్లను పోలవరం నుంచి ఇప్పటికే పట్టిసీమకు కావాల్సినన్ని తీసుకెళ్తున్నారు. గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌ను అనుసంధానం చేసుకున్నారు. అక్కడి నుంచి బనుక చర్ల పేరు మీద గోదావరి వరద జలాలతో నిర్మాణం చేసుకుంటామని చెప్పుకుంటున్నారు. బనకచర్లను మరింత విస్తరించి నల్లమల సాగర్ చేయాలని చూస్తున్నారు. తెలంగాణలో బహుళార్ధక ప్రాజెక్టు కాళేశ్వరం లాగా మల్లీ లిఫ్ట ఇరిగేషన్‌ను ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్నారు. ఇంత వరకు బాగానే వుంది. గోదావరి , కావేరి నదుల అనుసంధానం కోసం ఖర్చు తమిళనాడుతో పెట్టించడమో, లేక కేంద్రాన్ని ఒప్పించి, జాతీయ ప్రాజెక్టు అనుమతులు పొందితే తప్ప అది పూర్తి కాదు. అదే సాధ్యమైతే దిగువ రాష్ట్ర హక్కులనే వాదన చంద్రబాబు తెరమీదకు తేకుండా వుండలేరు. తెలంగాణ నీటి హక్కులను కాలరాయకుండా వుంటారని ఊహించలేము. ఇది సామాన్యులకు అర్ధమయ్యేది కాదు. కింది రాష్ట్రం వరద జలాలను తరలించుకుంటే నష్టమేమిటి? అని అనుకునే వారు కూడా వుంటారు. పోలవరం నుంచి సముద్రం వైపు నీళ్లు వెళ్లకుండా నీళ్లు మళ్లించుకొని తమిళనాడుకు ఇస్తే నష్టమేమిటి? అనే ప్రశ్నలు కూడా తెరమీదకు తెస్తారు. అయితే ఇక్కడే అసలు కథ వుంటుంది. గోదావరి నది నుంచి ఇప్పటికే కృష్ణా డెల్టాకు నీళ్లను మళ్లించే ప్రయత్నం దిగ్విజయంగా కొనాగింది. 11 నెలల్లో పట్టిసీమ పూర్తి చేసి కృష్ణా డెల్టాకే కాదు, రాయలసీమకు నీళ్లు పట్టుకెళ్తున్నారు. దానికి అదనంగా బొల్లా పల్లి రిజర్వాయర్ నింపుకునేందుకు మార్గం వేసుకుంటున్నారు. అక్కడి నుంచి బనకచర్లకు నీళ్లను తరలిస్తారు. అది నల్లమల సాగర్‌గా మార్చుకొని పెన్నా బేసిన్‌కు నీళ్లు తరలిస్తారు. రిజర్వాయర్లు నింపుకుంటారు. అక్కడి నుంచి కండలేరులో నీళ్లు నింపుకుంటారు. దక్షిణ భారత దేశంలోనే కండలేరు 60టిఎంసిల రిజర్వాయర్. తెలంగాణలో 50 టిఎంసిల రిజర్వాయర్ నిర్మాణం చేస్తే అవగాహన లేని తెలంగాణ రాజకీయ పక్షాలే గగ్గొలు పెట్టాయి. ప్రజలను నిరాశ్రయులను చేస్తున్నారన్నారు. భూకంపాలు వస్తే ఎలా అని ప్రజలను భయపెట్టారు. కాని కండలేరు నిర్మాణం చేసినప్పుడే ఎవరూ నోరు తెరవలేదు. ఇప్పుడు నల్లమల సాగర్ ఎన్ని టిఎంసిలో నిర్మాణం చేస్తారో బైటకు చెప్పడం లేదు. కండలేరు నుంచి కావేరీ నదికి నీళ్లు అందిస్తారు. మధ్యలో కుప్పం కూడా సమృద్ధిగా నీళ్లిచ్చేలా ప్లాన్‌లు చేస్తున్నారు. తమిళనాడులో తెలుగుదేశం రాజకీయం లేదు. అక్కడ తెలుగుదేశం రాజకీయం చేస్తే తమిళ ప్రజలు ఒప్పుకోరు. తమిళనాడుతో కలిసి వుండలేమనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోరుకున్నారు. మీరు మేము తెలుగు వాళ్లమే అని తెలంగాణతో కలిశారు. అరవై ఏళ్లు ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించారు. కాని ఏనాడు తెలంగాణను సస్యశ్యామలం చేద్దామన్న మనసు ఏ ఒక్కరికి రాలేదు. తెలుగు జాతి మనది, నిండుగ వెలుగు జాతి మనది అని పాట పాడిన ఎన్టీఆర్ కూడా తెలంగాణకు నీళ్లివ్వాలని ఆలోచించ లేదు. తమిళనాడుకు మాత్రం మంచినీళ్లు తరలించారు. పదేళ్లపాటు ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు తన హయాంలోఒక్కటంటే ఒక్క ప్రాజెక్టు నిర్మాణం చేయలేదు. కనీసంపెండింగ్ ప్రాజెక్టుల మీద దృష్టిపెట్టలేదు. బారీ నీటిపారుదల పేరుతో ఆంద్రాకు నీళ్లే కాదు, నిధుల వరద పారించారు. తెలంగాణ కోసం చిన్న నీటిపారుదల అని చెప్పి తెలంగాణను ఎండబెట్టారు. చంద్రబాబు పాలనలో ఏడేళ్లపాటు తీవ్రమైన కరువు వచ్చినప్పుడు ఆంద్రాకు నీళ్లెలా తరలించాలనే ఆలోచన చేశారు. ఆంద్రాలో రెండు పంటలు ఎలా పండాలన్నదాని మీదే చంద్రబాబు దృష్టిపెట్టారు. కాని ఎండుతున్న తెలంగాణను పట్టించుకోలేదు. గుక్కెడు మంచినీళ్లు ఇచ్చేందుకు కూడా చంద్రబాబుకు చేతులు రాలేదు. తెలంగాణ ఉద్యమం ఊపందుకున్నప్పుడు ఆఖరుకు ఇక దిగిపోయే సమయంలో 2004లో దేవాదుల నిర్మాణంచేస్తామని మరోసారి తెలంగాణ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. పదేళ్ల పాటు తెలంగాణను ఎండబెట్టి, మళ్లీ గెలవాలని దేవాదుల పేరు చెప్పి మోసం చేయాలని చంద్రబాబు చూశారు. ఇప్పటికీ తెలంగాణలో రాజకీయం చేయాలనుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకున్నారు. 2009లో వచ్చిన తెలంగాణ ప్రకటనను అడ్డుకున్నారు. ప్రకటించిన తెలంగాణ వెనక్కివెళ్లేలా కుట్రచేశారు. శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటు చేసి కాలయాపన చేసేందుకు దారి చూపారు. ఆఖరుకు వచ్చిన తెలంగాణను విఫల తెలంగాణ చేయాలని అనేక కుట్రలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏం చేశారో అందరూ చూశారు. ఆఖరుకు తట్టాబట్టా సర్ధుకొని చంద్రబాబు విజయవాడ వెళ్లిపోయారు. తెలంగాణలో రాజకీయం వుంది. తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేస్తారు. సీట్లు గెలుస్తారు. ప్రజల ఆశీర్వదిస్తే తెలంగాణలో కూడా పాలన సాగించాలని చూస్తున్నారు. కాని తెలంగాణకు అన్యాయం చేయొద్దన్న ఆలోచన మాత్రం మానుకోవడం లేదు? గోదావరి, కావేరి అనుసంధానం అంటేనే తెలంగాణకు మరోసారి తెలుగుదేశం అన్యాయం చేయడమే అవుతుంది. కావేరి జలవివాదాలు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల మధ్య ఈ నాటివి కాదు. రాజుల కాలం నుంచే ఈ సమస్య నలుగుతూ వుంది. చోళ్ల, పాండ్య, చేర రాజులు కూడా ఎంతో ప్రయత్నం చేశారు. కావేరి నీళ్లు సాదించుకోలేకపోయారు. వరద జలాల మీద ఆదారపడే చోళ రాజులు నదీ జలాల మీద ఆధారపడి తమిళనాడులో అనేక చెరువులు తవ్వించుకున్నారు. రాను రాను మారుతున్న వాతావరణ పరిస్దితులే కాకుండా కర్నాటక కావేరి మీద నిర్మాణం చేసిన ప్రాజెక్టుల మూలంగా తమిళనాడుకు సరిపడ నీళ్లు వెళ్లడం లేదు. రెండు రాష్ట్రాల మధ్య ఎడతెగని పంచాయతీలు సాగుతూనే వున్నాయి. అంతెందుకు ఉమ్మడి ఆంద్ర ప్రదేశ్ కాలంలో కృష్ణానది మీద కర్నాకట ప్రభుత్వం ఆల్‌మట్టి ఎత్తు ను పదే పదే పెంచుకున్నారు. అప్పుడు తెలంగాణకు అన్యాయం జరుగుతుందని ఏ ఆంద్రా పాలకుడు అడ్డుకోలేదు. కర్నాటకను ఎదిరించలేదు. అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. జూరాలకు నీటి చుక్క రాకుండా పోయిన రోజులు అనేకం వున్నాయి. అయినా ఆంద్రా నాయకుల మనసు ఆనాడు కరగలేదు. కాని ఆనాడైనా, ఈనాడైనా తమిళనాడు తల్లడిల్లుతుందని బాధ పడుతున్నారు. గోదావరి , కావేరి నదుల అనుసంధానంతో తమిళనాడుకు నీళ్లివ్వాలనుకుంటున్నారు. తెలంగాణలో మాత్రం రాజకీయం చేయాలనిచూస్తున్నారు. తెలంగాణ పచ్చగా వుంటే ఓర్వలేని తనాన్ని చూపించుకుంటూనే వున్నారు.



నేటిధాత్రి®
నిష్పక్షపాత వార్తల నిధి
తెలుగు వార్త పత్రిక
22ND ANNIVERSARY



శుక్రవారం 16-10-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 176 రూ|| 6.00





# దసరా నుంచి ఓపీ సేవలు!

## వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో

- తుది దశకు 24 అంతస్తుల ఆసుపత్రి నిర్మాణ పనులు
- డిసెంబరు నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చే యోచన
- క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి బృందం



వరంగల్, నేటిధాత్రి:
వరంగల్ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పాత సెంట్రల్ జైలు ప్రాంగణంలో నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 20న దసరా సందర్భంగా ఆసుపత్రిలో ప్రాథమికంగా బాహ్య రోగుల విభాగం (ఓపీ) సేవలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, డిసెంబరు నాటికి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు చెప్పారు.

### నిర్మాణ పనులపై సమీక్ష

ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణితో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, వైద్యాధికారులు, రహదారులు--భవనాల శాఖ అధికారులతో పనుల పురోగతిపై చర్చించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న వైద్య విభాగాలు, రోగులకు కల్పించనున్న సదుపాయాలు, చికిత్సకు అవసరమైన మౌలిక వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ నెల 17న మరోసారి నిర్మాణ పనులను పరిశీలిస్తామని మంత్రి వెల్లడించారు.

### తుది దశకు నిర్మాణం

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రస్తుత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిధులు కేటాయించి పనులను వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు. నిరంతర పర్యవేక్షణతో నిర్మాణం చివరి దశకు చేరుకుందని పేర్కొన్నారు. చిన్నచిన్న పనులు మినహా ఆసుపత్రి సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

### కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి

ఆసుపత్రి అందుబాటులోకి వస్తే వరంగల్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రోజుకు సుమారు ఐదు వేల మంది వరకు రోగులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డిసెంబరు నాటికి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

## మైనారిటీల సంక్షేమం

# చంద్రబాబు హయాంలోనే సాధ్యం!

- మత పెద్దలకు రూ.22.50 కోట్ల గౌరవ వేతనాలు విడుదల
- కూటమి పాలనలోనే మైనారిటీలకు భరోసా: ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్



అమరావతి, నేటిధాత్రి:
మైనారిటీలకు విద్య, ఉపాధి, సంక్షేమం అందించడంతోపాటు మత పెద్దలకు సముచిత గౌరవం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని గుంటూరు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. రాష్ట్రంలోని మైనారిటీ మత పెద్దల గౌరవ వేతనాల కోసం ప్రభుత్వం రూ.22.50 కోట్లను విడుదల చేసిందని తెలిపారు. జులై నుంచి సెప్టెంబరు వరకు మూడు నెలల గౌరవ వేతనాలను ఒకేసారి అందిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో నిధుల విడుదలలో జాప్యం జరగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

### 27 నెలల్లో రూ.202 కోట్లు విడుదల

వైసీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మత పెద్దలకు అరకొర నిధులతో అన్యాయం జరిగిందని నసీర్ అహ్మద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 27 నెలల్లో మత పెద్దల గౌరవ వేతనాల కోసం రూ.202 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రద్దయిన సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తూ మైనారిటీల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నామని చెప్పారు.

### హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం

హజ్ యాత్రకు వెళ్లే ఒక్కో యాత్రికుడికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. గతంలో వైసీపీ నాయకుల ఆక్రమణల్లోకి వెళ్లిన వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకుని మైనారిటీల సంక్షేమానికి వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలవుతున్నాయని నసీర్ అహ్మద్ వివరించారు.

# విదేశీ బొగ్గు దిగుమతితో సింగరేణికి మరణశాసనం!

- రూ.3 వేల కోట్ల కుంభకోణానికి కుట్ర.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఆరోపణలు
- భోత్రా లాజిస్టిక్స్‌తో ఒప్పందాలపై అనుమానాలు.. స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్
- విదేశీ బొగ్గు దిగుమతిని వెంటనే నిలిపివేయాలి.. సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ



హైదరాబాద్, నేటిధాత్రి:
విదేశీ బొగ్గు దిగుమతుల పేరుతో రూ.3 వేల కోట్ల కుంభకోణానికి కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిని బలహీనపరిచి, కమీషన్ల కోసం విదేశీ బొగ్గు దిగుమతులకు తెరలేపారని విమర్శించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాస్తూ, దిగుమతులను నిలిపివేసి స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.
భోత్రా లాజిస్టిక్స్ ఎంపిక, ఒప్పందాల వివరాలను బయటపెట్టాలని కోరారు. టన్నుకు రూ.1,500 చొప్పున అక్రమాలకు పాల్పడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. యాదాద్రి విద్యుత్తు కేంద్రానికి అవసరమైన జీ9 బొగ్గు సింగరేణిలో లేదన్న వాదనపైనా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణికి రావాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని, సంస్థ ప్రయోజనాలను దెబ్బతీసే చర్యలను అడ్డుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ

# గెలుపే లక్ష్యం!

- కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం సమన్వయంతో పనిచేయాలి
- క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలి
- మడికొండలో ఎన్నికల సమన్వయ సమావేశంలో మంత్రి పొంగులేటి



మడికొండ, నేటిధాత్రి:
# దేవాలయాల అభివృద్ధి, ఆస్తుల పరిరక్షణకు ఎండోమెంట్ సెల్ కృషి చేయాలి

▸▸బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా ఎండోమెంట్ సెల్ నూతన కార్యవర్గ సమావేశం...

▸▸నూతన సమన్వయకర్తలకు నియామక పత్రాల అందజేత...



యాదాద్రి భువనగిరి, నేటిధాత్రి: యాదాద్రి భువనగిరి జిల్లాలోని దేవాలయాల అభివృద్ధి, దేవాలయ ఆస్తుల పరిరక్షణ, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అనుబంధ విభాగమైన జిల్లా ఎండోమెంట్ సెల్ నూతన కార్యవర్గ సమావేశం బుధవారం లక్కీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. జిల్లా కన్వీనర్ సురకంటి జంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూర్ అశోక్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని దేవాలయాల అభివృద్ధి, ఆలయాల నిర్వహణలో పారదర్శకత, దేవాలయ ఆస్తుల పరిరక్షణ, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో దేవాలయాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఆలయాల అభివృద్ధికి ఎండోమెంట్ సెల్ చురుకైన పాత్ర పోషించాలని సమావేశంలో నిర్ణయించారు. నూతన కార్యవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ దేవాలయాల పరిరక్షణకు, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు, భక్తుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని నాయకులు సూచించారు. జిల్లాలో ఎండోమెంట్ సెల్‌ను మరింత బలోపేతం చేసి, దేవాలయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

▸▸**నూతన నియామక పత్రాల అందజేత....** సమావేశంలో భాగంగా నూతనంగా నియమితులైన పలువురు నాయకులకు నియామక పత్రాలను అందజేశారు. ఆలేరు అసెంబ్లీ సమన్వయకర్తగా కళ్లెం శ్రీనివాస్ గౌడ్, భువనగిరి అసెంబ్లీ సమన్వయకర్తగా నల్లమశేకర్ గౌడ్, జిల్లా జాయింట్ కన్వీనర్‌గా బొమ్మని రాజమణి నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్య ప్రకాష్, రాష్ట్ర కో-కన్వీనర్ దేవి ప్రసాద్, నిరంజన్ దేశాయ్, రాష్ట్ర జాయింట్ కన్వీనర్ రంగ రామ గౌడ్, జిల్లా కో-కన్వీనర్లు రంగా సత్యనారాయణ, కేసారం కృష్ణారెడ్డి, జిల్లా జాయింట్ కన్వీనర్లు నగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి, భక్తుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేస్తుందని నాయకులు తెలిపారు.

# స్కందమాత అవతారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



పరకాల, నేటిధాత్రి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ, మదన పోచమ్మ ఆలయంలో ఐదవ రోజు అమ్మవారు స్కందమాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మణిదీప్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గౌరిశెట్టి శోభారాణి సాంబశివుడు దంపతుల సారథ్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవునూరి మేఘనాథ్, నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి, రాజేష్ గంగు, కృపేందర్ రెడ్డి, నిఖిల్, సాయి, వరప్రసాద్, రాకేష్, రాజేంద్రప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎస్సార్



భూపాలపల్లి, నేటిధాత్రి: గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి వన్ ఇంక్లైన్, సిక్స్ ఇంక్లైన్ బొగ్గు బావుల్లో దుర్గామాత దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో దుర్గామాతను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ..దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తి,ఆధ్యాత్మికతకు ప్రతీకలని,దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో భూపాలపల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు బావుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కష్టానికి తగిన గుర్తింపు లభించాలని ఆకాంక్షించారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సంతోషంగా,సురక్షితంగా ఉండాలని, సింగరేణి ప్రాంతంలో సుఖశాంతులు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు, సింగరేణి కార్మికులకు దుర్గామాత నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొండయ్య 30వ వార్డు కౌన్సిలర్ బోర్డు అశోక్ సమ్మయ్య సింగరేణి అధికారులు, కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీక

▸▸గిరిజన సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు...

▸▸ఎమ్మెల్యే జీఎస్సార్..



భూపాలపల్లి, నేటిధాత్రి: భూపాలపల్లి పట్టణం 19 వ వార్డుతో పాటు కుందూరు పల్లిలో రూరల్ మండలంలోని కమలాపూర్ గ్రామాల్లో గిరిజన సోదర సోదరీమణులు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్న తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు,ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రత్యేక గుర్తింపు అని పేర్కొన్నారు. గిరిజన సోదర సోదరీమణులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కుందూరు పల్లిలో రూ.10 లక్షలతో నిధులు గిరిజన సోదరుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణం కోసం నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే గారు తెలిపారు. దేవాలయ నిర్మాణానికి అవసరమైతే మరిన్ని నిధులు కూడా కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. గిరిజనుల అభ్యున్నతికి, వారి సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య 19 వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ తిరుపతి గిరిజన సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం.. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు గుర్తింపు

▸▸గంజాయి, అక్రమ మద్యం నిర్మూలనపై ప్రత్యేక నిఘా.. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన...

▸▸ప్రజల భద్రతే లక్ష్యంగా గ్రామాల్లో విస్తృత తనిఖీలు...



మహబూబాబాద్, నేటిధాత్రి: మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గూడూరు సర్కిల్ పరిధిలోని కొత్తగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌతుగూడెం, చింతగట్టు తండా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది పోలీసు



సిబ్బంది పాల్గొని సుమారు 120 ఇళ్ల పరిధిలో తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేదా నంబర్ ప్లేట్లు లేని 24 వాహనాలను గుర్తించారు. అలాగే 15 లీటర్ల అక్రమ మద్యం (గుడుంబా), సుమారు 500 లీటర్ల బెల్లం వాష్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రోడ్డు భద్రత, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల నివారణ, పోలీస్--ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతం, ప్రజల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్లు గూడూరు సీఐ వినయ్ తెలిపారు.

# మొగుల్లపల్లి దసరా ఉత్సవాలకు ముస్తాబు ఘనంగా రావణవధ కమిటీ ఏర్పాటు

▸▸సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణం వేదికగా అంగరంగ వైభవంగా రావణవధ - సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతుల ఆధ్వర్యంలో నూతన కమిటీ కొలువు:





మొగులపల్లి, నేటిధాత్రి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుల్లపల్లి మండల కేంద్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు మొదలయ్యాయి. మొగుల్లపల్లి - ముల్కలపల్లి గ్రామాల నడిబొడ్డున ఉన్న ప్రసిద్ధ శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా దసరా పండుగ పురస్కరించుకుని నిర్వహించే రావణవధ మహోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మొగుల్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతుల అధ్యక్షతన గ్రామ పెద్దలు, యువకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రావణవధ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి, ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చాట్ల రవీందర్ మాట్లాడుతూ, మొగుల్లపల్లి రావణవధ కార్యక్రమం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఎంతో ప్రత్యేకమని, చుట్టుపక్కల మండలాల నుండి వేలాది మంది భక్తులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వస్తారని అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరిగే ఈ రావణవధ కార్యక్రమాన్ని ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గౌరవ అధ్యక్షులు : గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు, వేముల మహేందర్ గౌడ్, మోరే రవీందర్ రెడ్డి, ఎర్రబెల్లి కోటేశ్వర్ రావు కమిటీ అధ్యక్షులు : వేముల కిరణ్ గౌడ్ ఉపాధ్యక్షులు : దండు కుమారస్వామి (లడ్డు), దేవునూరి మధు, నిమ్మల తిరుపతి ప్రధాన కార్యదర్శి : చిలివేరు పున్నం చందర్ - ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను చూస్తారు. సంయుక్త కార్యదర్శులు : తిప్పారపు సురేందర్, క్యాతరాజు రమేష్, చెక్క శ్రీధర్ కోశాధికారి : గుడిమల్ల రమేష్ కమిటీ సభ్యులు : దేవునూరి వెంకటేష్, సిహెచ్ వంశీ, వి పవన్, అభినయ్, డి స్వామి, బన్ని, వనం సాగర్, తూర్పటి దేవేందర్, కొడారి ఓదెలు, చెక్క శ్రీను, అన్నారపు కుమార్, దేవునూరి అశోక్, రాస ప్రశాంత్, ఉడుత రాకేష్ కమిటీ ఎంపిక అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు వేముల కిరణ్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, అందరినీ కలుపుకుని రావణవధ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్‌గా ఇక్బాల్ నియామకం

**ఉద్యోగుల ముఖాముఖి సమావేశం విజయవంతం కావడంలో కీలక పాత్ర**



వరంగల్, నేటిధాత్రి: ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్‌గా తహసీల్దార్ ఇక్బాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఉద్యోగులు, పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించిన ఉద్యోగుల ముఖాముఖి సమావేశానికి అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయడంలో ఇక్బాల్ కీలక పాత్ర పోషించారని పలువురు అభినందించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి హక్కుల సాధనకు జేఏసీ వేదికగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇక్బాల్ నాయకత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టి, ఉద్యోగుల ఐక్యతను బలోపేతం చేయాలని కోరారు. జేఏసీ చైర్మన్‌గా నియమితులైన ఇక్బాల్‌కు ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు.

# గీసుగొండ బసవేశ్వర ఆలయంలో శాకంబరీ దేవిగా అమ్మవారు దర్శనం



గీసుగొండ, నేటిధాత్రి: గీసుగొండ మండల కేంద్రంలోని శ్రీ బసవేశ్వర శివాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన గురువారం అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా, శాకంబరీ అలంకరణలో వివిధ రకాల కూరగాయలతో దర్శనమిచ్చారు. శాకంబరీ అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు యాదగిరి లక్ష్మీనారాయణ, బి. రమేష్, గుడిమెట్ల రాధాకృష్ణమూర్తిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు యాదగిరి అశోక్, ఉపసర్పంచ్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కోట ప్రమోద్, ముఖ్య నాయకులు టిగిరికారి శ్రీకాంత్, మహమ్మద్ సోని, యాదగిరి కుమార్, కోలా వేణు, పుల్లూరి రవి, వటుకుల రవీందర్ రెడ్డి, కోట నాగేష్, వీరాటి రాజిరెడ్డి, కోలా ప్రవీణ్, పొగాకు రాజన్న, నరిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

▸▸**శుక్రవారం చండీ హోమం, మహా అన్నదానం...**

శుక్రవారం 16న ఆలయ ప్రాంగణంలో శ్రీ చండీ హోమం, సాయంత్రం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



# పోచమ్మ గడ్డ తండాలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

బాలానగర్, నేటిధాత్రి: మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలంలోని పోచమ్మ గడ్డ తండాకు చెందిన కేతావత్ చిట్టి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్, సర్పంచ్ కుమార్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు నూతన గృహ యజమాని కేతావత్ చిట్టికి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ఎంతగానో దోహదపడుతోందని పేర్కొన్నారు.

# బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



నర్సంపేట, నేటిధాత్రి: తెలంగాణ మహిళల సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలకు మున్సిపాలిటీ వ్యాప్తంగా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం పట్టణంలోని అంగడి మైదానంతో పాటు పలు వార్డుల్లోని బతుకమ్మ ఆట స్థలాలను మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, కౌన్సిలర్లతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ప్రధాన మైదానాల్లో ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్తు దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బీరం భరత్‌రెడ్డి, బాణాల ప్రసన్న, పొన్నాల మనిష, రాయిడి కీర్తి, మండల శ్రీదేవి, వార్డు అధ్యక్షుడు మంచినీళ్ల నాగరాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కందిక స్వామి, జవాన్ రమేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లలితా దేవి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాత.



కల్వకుర్తి, నేటిధాత్రి: నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో శ్రీ వాసవి మాత దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం నాడు ఐదవ అవతారం లలితా దేవి అవతారం లో దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ కుంకుమార్చనలు, భగవద్గీత పారాయణాలు నిర్వహించారు. అనంతరం మహిళలచే సామూహిక మణిద్వీప వర్ణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎం.పీ. రాములు వారి కుమారుడు భరత్ నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు ఆకుతోట రాజశేఖర్, జిల్లా కార్యదర్శి స్వామి ముఖ్యఅతిథిగా విచ్చేశారు .సాయంత్రం 7:00 శివపార్వతుల కళ్యాణం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పందరి ట్రస్టీ చైర్మన్ జూలూరు రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు కలిమిచర్ల గోపాలు, కార్యదర్శులు నారాయణ రాజు, పానుగంటి నవీన్, కోశాధికారులు గుబ్బ కిషన్, వాస మనీష్, బాదం రాఘవేందర్ అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో ఓంకార్ 18వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలి

**ఎంసీపీఐ(యు) డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్..**



**నర్సంపేట, నేటిధాత్రి:** మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఐక్య)-ఎంసీపీఐ(యు) పార్టీ వ్యవస్థాపకులు, అమరజీవి, 'అసెంబ్లీ టైగర్' మద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్ పిలుపునిచ్చారు. గురువారం నర్సంపేటలోని ఓంకార్ భవన్ పార్టీ కార్యాలయంలో దుగ్గొండి మండల కార్యదర్శి కామ్రేడ్ సింగతి మల్లికార్జున్ అధ్యక్షతన డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహమ్మద్ రాజాసాహెబ్ మాట్లాడుతూ.. అమరజీవి మద్ది కాయల ఓంకార్ సుదీర్ఘ రాజకీయ జీవితం నేటి యువతరానికి ఎంతో ఆదర్శనీయమని, ఆయన అందించిన సేవలు అనుసరణీయమని కొనియాడారు. 1972లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో ఏకైక కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి, వరుసగా ఐదు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఎన్నికై 1994 వరకు సేవలందించారని గుర్తుచేశారు. ఆయన కేవలం నర్సంపేటకే పరిమితం కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల ప్రజల సమస్యలపై పోరాడిన నిస్వార్థ రాజకీయ ధురందరుడని ప్రశంసించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ వంగల రాగసుధ,కలకొట్ల యాదగిరి, కేశెట్టి సదానందం, బుడిమే సురేందర్, మహమ్మద్ అల్లిసాహెబ్, బత్తిని కుమారస్వామి, కర్నే సాంబయ్య, మార్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూములను పరిరక్షించాలి గ్రామ యువత, ప్రజలు



**కరీంనగర్, నేటిధాత్రి:** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నరసింహులపల్లి గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 290, 291, 293, 295, 296, 297, 143, 239, 230, 269, 298, సర్వారెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్369, జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కలపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 503, పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామంలోని 419 సర్వేనెంబర్, రామడుగు మండలం తిర్మలాపూర్ గ్రామంలోని సర్వేనెంబర్ 75లలో మొత్తం 45.07 గంటల భూమి ఉన్నట్లు ఫైల్ నెంబర్: బి132/2020 తేది: 10జనవరి2020 ద్వారా గంగాధర తహశీల్దార్ వారు దేవాలయ భూముల వివరాలను సహకమీషనర్ దేవాదాయ ధర్మాదాయశాఖ కరీంనగర్ జిల్లాకు వెల్లడించినట్లు సమాచారం తెలియవచ్చిందని గ్రామంలోని యువకులు తెలిపారు. ఈవిషయంపై గతంలో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశామని గ్రామ యువత తెలిపారు. కావున సంబంధిత అధికారులు మరియొక్కసారి నిజనిర్ధారణ జరిపి అట్టి భూముల రక్షణకు చర్యలు తీసుకోవడం వల్ల దేవాలయ అభివృద్ధికి తోడ్పడునందిస్తారని ప్రజలు, యువత పత్రిక ముఖముగా అధికారులను కోరుతున్నారు.


DETAILS OF ENDOWED LANDS IN GANGADHARA

# యువజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.



**కల్వకుర్తి, నేటిధాత్రి:** కల్వకుర్తి పట్టణంలోనిఇందిరా నగర్ కాలనీలో గురువారం నాడు యువజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో గురు గణపతి భక్తబృందం సభ్యులు ఘనంగా అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో యువజ్యోతి యువజన సంఘం సభ్యులు మరియు ఇందిరానగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిట్యాల గ్రామ అభివృద్ధికి రూ. కోటి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి బీజేపీ నాయకుల వినతి.



**చిట్యాల, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సైడ్ డ్రైనేజీలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ. కోటి మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి దేవాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు, చిట్యాల ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య సలహా మేరకు గ్రామ అభివృద్ధి కోసం ఈ విజ్ఞప్తి చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్యాల గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సైడ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీటి పారుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అంతర్గత రహదారుల అభివృద్ధి లేకపోవడంతో గ్రామ ప్రజలు రాకపోకల్లో సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సైడ్ డ్రైనేజీల నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల అభివృద్ధి పనుల కోసం ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ. కోటి మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ వినతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధుల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు రావుల రాకేష్, మైదం శ్రీకాంత్, కేంసారపు ప్రభాకర్, ఉండ మణికుమార్, బుర్ర రాహుల్‌తో పాటు దుర్గామాత మాలధారణ చేసిన భక్తులు బుర్ర రణధీర్, బుర్ర రితేష్, బుర్ర అరవింద్, బుర్ర కృష్ణ, బుర్ర అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామమంతా పండుగ శోభ - వీధుల శుభ్రత, మైదానం సుందరీకరణ పనులు ముమ్మరం

**సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం - ఏర్పాట్లు పర్యవేక్షించిన సర్పంచ్ సప్పిడి ఇందిరా, కాంగ్రెస్ జిల్లా నాయకులు మెరుగు సురేష్ గౌడ్...**



**మొగుళ్ళపల్లి, నేటిధాత్రి:** మొగుల్లపల్లి మండలం పెద్దకోమటిపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుల్లపల్లి మండలం పెద్దకోమటిపల్లి గ్రామంలో తేదీ 15/10/2026 న సర్పంచ్ సప్పిడి ఇందిరా, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మెరుగు సురేష్ గౌడ్ గారు గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. గ్రామంలో బతుకమ్మ వేడుకలు జరిగే మైదానాన్ని శుభ్రం చేయడం, వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, రహదారులను శుభ్రపరచడం వంటి పనులు ముమ్మరంగా చేస్తున్నారు. మహిళలు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ ఆటపాటలను ఆడుకునేందుకు వీలుగా మైదానాన్ని చదును చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ఆడబిడ్డలందరూ సద్దుల బతుకమ్మ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నెక్కొండ బతుకమ్మ ఆట స్థలంలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణం ప్రారంభం



**నెక్కొండ, నేటిధాత్రి:** నెక్కొండ చెరువు సమీపంలోని బతుకమ్మ ఆట స్థలంలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్‌డీఎఫ్) నుంచి మంజూరైన నిధులతో చేపడుతున్న ఈ పనులను సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ప్రారంభించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఆటపాటలు నిర్వహించే ఈ స్థలంలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణం పూర్తయితే వారికి మరింత సౌకర్యంగా ఉంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నిధులు కేటాయించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజల తరపున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

**సింగరేణి బకాయిలు చెల్లించి బొగ్గు ఉత్పత్తిని పెంచాలి...**

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి...**



**భూపాలపల్లి, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ ముందుచూపు లేని నిర్ణయాలు,విద్యుత్ ఉత్పత్తి సరఫరా వ్యవస్థపై సరైన ప్రణాళిక లేకపోవడమే ప్రధాన కారణాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ విద్యుత్ కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంట పొలాలు ఎండిపోతున్నాయని, మోటార్లు తిరగకపోవడం తో సాగునీటి సరఫరా నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు కారణమయ్యాయనే అంశాన్ని ప్రభుత్వం సమీక్షించాలని కోరారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, సింగరేణి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సుమారు రూ. 60 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గడం, ఓవర్‌బర్డెన్ (ఓబీ) టెండర్లలో రాజకీయ జోక్యం, అవినీతి ఆరోపణలు వంటి అంశాలు బొగ్గు సరఫరాపై ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బొగ్గు సరఫరా సక్రమంగా లేకపోతే థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తగ్గుతుందని, దాని ప్రభావం రాష్ట్ర విద్యుత్ వ్యవస్థపై పడుతుందని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందిందని, అప్పట్లో విద్యుత్ సరఫరా విషయంలో రైతులు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కోలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం మోటార్లు పనిచేయకపోవడం, ఫ్యూజులు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం వంటి సమస్యలతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారని, బోర్లు, బావులు, వాగులు, వంకల నుంచి లభించే నీటిని ఉపయోగించుకునే సమయంలోనూ విద్యుత్ సరఫరా సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరి పంటలు కీలక దశలో ఉన్నందున మరో 15 రోజుల నుంచి నెల రోజుల వ్యవధి ఎంతో ముఖ్యమని, ఈ సమయంలో విద్యుత్ అంతరాయాలు కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పటన అధ్యక్షుడు జనార్ధన్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి 28వ వార్డు కౌన్సిలర్ భోగం నరేందర్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెంకటరాణి సిద్దు వడిదల సమ్మయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే సమాఖ్య లక్ష్యం

**సోలార్ రంగంలోకి శ్రీ ఇన్వ్రా.. సన్‌స్కోప్ గ్రూప్‌తో భాగస్వామ్య ఒప్పందం....**



**శేరిలింగంపల్లి, నేటిధాత్రి:** వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో యువతను ప్రోత్సహించి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్' ప్రధాన ఉద్దేశమని సమాఖ్య స్పాన్సర్‌షిప్, శ్రీ ఇన్వ్రా మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఘనంగా నిర్వహించిన ఈ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన శ్రీ ఇన్వ్రా, సన్‌స్కోప్ గ్రూప్ సంయుక్త స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేదికగా శ్రీ ఇన్వ్రా సంస్థ, సన్‌స్కోప్ గ్రూప్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుని సోలార్ పవర్ రంగంలోకి అధికారికంగా అడుగుపెట్టింది. ఈ సందర్భంగా శ్రీ ఇన్వ్రా ఎండీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వర్టికల్ గ్లాస్ బిల్డింగ్స్‌కు సోలార్ ప్యానెల్స్ అమర్చడం, ప్రతి ఇంటికీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడమే ఈ భాగస్వామ్య ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఇళ్లకు సంబంధించిన సివిల్ కన్‌స్ట్రక్షన్, ఇంటీరియర్ డిజైన్స్, పాత ఇళ్ల రినోవేషన్స్, వాటర్‌ప్రూఫింగ్ రంగాల్లో ఇప్పటికే తమ సంస్థ నమ్మకమైన సేవలు అందిస్తోందని, ఇప్పుడు సోలార్ శక్తి రంగంలోకి విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో సేవలు విస్తరిస్తాం: సంజీవ్ కుమార్ (సీఈఓ, సన్‌స్కోప్ గ్రూప్) దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యుత్ కొరత ప్రధాన సవాలుగా మారుతోందని సన్‌స్కోప్ గ్రూప్ సంస్థ సీఈఓ సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్ కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని, అందుకే ప్రకృతి ప్రసాదించిన సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కూడా అందుబాటులో ఉండే తక్కువ ధరల్లోనే సోలార్ ప్యానెల్స్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్నామని ఆయన తెలిపారు. శ్రీ ఇన్వ్రా భాగస్వామ్యంతో రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు సమగ్ర ప్రణాళికలు రచిస్తున్నట్లు సంజీవ్ కుమార్ వెల్లడించారు.

**మీ పేపర్ అవసరాలకు తగ్గట్లు ఇతర హెడ్‌లైన్ ఆప్షన్లు:**

**హైటెక్స్‌లో సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్: సోలార్ రంగంలోకి శ్రీ ఇన్వ్రా అరంగేట్రం**

**ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ అందించడమే లక్ష్యం: శ్రీ ఇన్వ్రా ఎండీ శ్రీనివాసరావు**

**సన్‌స్కోప్ -- శ్రీ ఇన్వ్రా భాగస్వామ్యం: దక్షిణాది రాష్ట్రాలకు విస్తరణ**

# కరువు పరిస్థితి పై అధికారులు సమీక్ష జరిపి నష్టం పై అంచనా వేయాలి

**ఏఐకెఎంఎస్ డిమాండ్..**



**గుండాల, నేటిధాత్రి:** అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకెఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం కల్తీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గుండాల మండలం కాచనపల్లి లో జరిగింది.. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య పాల్గొన్నారు. రాష్ట్రంలోనూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ప్రభుత్వం కరువు పరిస్థితి పై సమీక్ష జరిపి వాస్తవ పరిస్థితిని రైతులకు కూలీలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. పంట కొనుగోలులో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని, అరాచకాన్ని నివారించాలని ప్రభుత్వమే గిట్టుబాటు ధర చెల్లించి వరి ధాన్యం , పత్తి, మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బోరు బావులకు 16 గంటలు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ పై ప్రభుత్వ ప్రకటనలు నమ్మశక్యంగా లేవని కార్పొరేటర్లకు మేలు చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తక్షణమే ఈ తప్పుడు పద్ధతిని మానుకోవాలని కోరారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కరువు పరిస్థితి పై ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని నిరసిస్తూ ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయం ముందు వందలాది రైతు కూలీలతో నిరసన ప్రదర్శన ధర్నా నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రభుత్వం రైతులు, కూలీల ఆహార భద్రత ఎడల బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పంట నష్టాలపై శ్వేత పత్రం విడుదల చేసి మండలాల వారీగా కరువు తీవ్రతకు అనుగుణంగా రైతుల పంటకు నష్టపరిహారం చెల్లించాలి. కూలీలకు ఉపాధి పనులను కల్పించి రోజుకు 600 కూలి చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బియ్యంతో పాటు ఇతర నిత్యవసర వస్తువుల సరుకుల ధరలను కనీస స్థాయి తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా నిర్వహిస్తే రాష్ట్రస్థాయిలో ఆందోళనకు సిద్ధం కావాలని రైతు కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్కే ఉమర్ , పూనెం రంగయ్య, కొమరం సత్యనారాయణ, గడ్డం లాలయ్య, మూడు మాలు, కుంజ కృష్ణ, గొగ్గల రాజు, భూక్య హర్ష , గూగుల్ రామచంద్ర, పూనెం కోటయ్య, బచ్చలి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేయాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ...**

**భూపాలపల్లి, నేటిధాత్రి:** జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం గోరికొత్తపల్లి మండలం, చెన్నా పూర్ గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో భూముల సర్వే, డ్రై మరియు వెట్ భూముల గుర్తింపు, గ్రామ హద్దులు, చెరువుల సరిహద్దులు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి మండలంలో రీ-సర్వే పనుల నిర్వహణకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. రోజువారీ సర్వే లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. డ్రై, వెట్ భూముల సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. సర్వే సిబ్బందికి ఎదురవుతున్న ఐడీ, లాగిన్ తదితర సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో భాగంగా అవసరమైన ధృవపత్రాలు, నోటీసుల జారీని నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ పారదర్శకంగా, లోపాలకు తావులేకుండా జరిగేలా అధికారులు, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతు కల్పనతో రీ సర్వే గురించి మాట్లాడారు. రోజుకు ఎన్ని ఎకరాలు సర్వే చేస్తున్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డిఓ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆర్డిఓ హరిక్రిష్ణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, తహసీల్దార్ హేమ, సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సాయం



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం చెల్పూర్ లో ఇటీవల మృతి చెందిన పొనగంటి కొంరమ్మ, మొలుగూరి సమ్మయ్య, తాటికంటి రాములు కుటుంబాలను శ్రీ మార్కండేయ పద్మశాలి సేవా సంఘం మాజీ అధ్యక్షులు, బహుజన సాహిత్య అంతర్జాతీయ అవార్డు గ్రహీత దుంప నర్సయ్య శ్రీ గణేష్ హోటల్, బస్టాండ్, సామల సుధాకర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# వేముల వికాస్ స్మారకార్థం రక్తదాన శిబిరం



**మనోరంజన్ సేవా భవన్ మిత్రుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం...**

**నస్పూర్, నేటిధాత్రి:** వేముల వికాస్ స్మారకార్థం మనోరంజన్ సేవా భవన్ మిత్రుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికాస్ మిత్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,పరిచయస్తులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. సామాజిక బాధ్యతగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా రక్తదానం ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీసీసీ ఎస్సై కాజుద్దీన్, 34వ డివిజన్ కార్పొరేటర్ అగ్గు సాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదానం ప్రాణదానంతో సమానమని,అత్యవసర సమయాల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు రక్తదాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి విలువైన సేవ అందించవచ్చని తెలిపారు. వేముల వికాస్ స్మారకార్థం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో ఆయన మిత్రులు,కుటుంబ సభ్యులు, పరిచయస్తులు పాల్గొని తమ అభిమానాన్ని,సామాజిక సేవ పట్ల నిబద్ధతను చాటుకున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం,సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కలిసిన మడికొండ బ్రదర్స్



**పరకాల, నేటిధాత్రి:** వరంగల్.ఖమ్మం.నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పరకాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మడికొండ బ్రదర్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను,బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్,సమన్వయ కమిటీ సభ్యుడు మడికొండ సంపత్ కుమార్,బొజ్జం సాయి కుమార్ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# రోడ్డు భద్రత మనందరి బాధ్యత.. రోడ్డు నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం.

**▶▶సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పి నరసింహ ఐపీఎస్...**

**▶▶జిల్లాలోని 45 బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు....**



**సూర్యాపేట, నేటిధాత్రి:** హెచ్చరిక బోర్డులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి చౌరస్తా వద్ద రోడ్డు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాలో రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ట్రాఫిక్ నివారణ లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ నర్సింహ ఆధ్వర్యంలో అనేక చర్యలు చేపడుతున్నారని అన్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా రహదారి ప్రమాదాలను అరికట్టడానికి మరియు ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా ముమ్మర చర్యలు చేపడుతున్నాయి. ఎస్పీ నాయకత్వంలో పోలీస్ శాఖ చేపడుతున్న రహదారి భద్రతా కార్యక్రమాలను విశేషంగా అభినందించారు. నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న సుమారు 45 కంటే ఎక్కువ “బ్లాక్ స్పాట్స్” (ప్రమాదకర ప్రాంతాలు) లొకేషన్లను పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా గుర్తించింది. వాహనదారులు ఈ ప్రాంతాల గుండా వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసేందుకు అక్కడ ప్రత్యేకమైన ట్రాఫిక్ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా ఈ బోర్డులపై రేడియం స్టిక్కర్లతో కూడిన ముఖ్యమైన వివరాలను రూపొందించారు. వాహనదారులు మరియు ప్రయాణికులు రహదారులపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా వేగ పరిమితిని దాటకుండా జాగ్రత్త వహించాలని, తమ ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రమాదాలు ఎదురైతే వెంటనే సహాయం పొందేందుకు 112 నంబర్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ నంబర్‌కు కాల్ చేస్తే వెంటనే పోలీస్ మరియు అత్యవసర సేవలు లభిస్తాయి. అంతేకాకుండా, ప్రమాదం జరిగిన స్థలంలోనే తక్షణ సహాయం కోసం సంబంధిత స్థానిక అధికారుల ఫోన్ నంబర్లను కూడా ఈ హెచ్చరిక బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించారు అన్నారు. ఎస్పి నరసింహ మాట్లాడుతూ ...సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలు జరిగే అవకాశమున్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, వాహనదారుల సురక్షిత ప్రయాణం కోసం ప్రత్యేక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ హెచ్చరిక బోర్డులను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని జాతీయ రహదారులలో ఎక్కడైతే ప్రమాదాలు జరిగే అవకాశముందో (బ్లాక్ స్పాట్స్) అటువంటి 45 ప్రాంతాలను గుర్తించాము. ప్రతి బ్లాక్ స్పాట్‌కు ఇరువైపులా 100 మీటర్ల పరిధిలో రోడ్డు వినియోగదారుల క్షేమం కోసం ప్రతి స్పాట్ వద్ద రెండు బోర్డుల చొప్పున ఏర్పాటు చేయడం జరిగింది. రాబోయే దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగల సమయంలో రహదారులపై ప్రజల రాకపోకలు, వాహనాల రద్దీ పెద్ద ఎత్తున ఉంటుంది. ప్రయాణికులు హెచ్చరిక బోర్డులను గమనిస్తూ ప్రమాదకర ప్రాంతాలలో వాహనాలను నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలి అన్నారు వాహనదారులు డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను పాటిస్తూ, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలి. అరైవ్ అలైవ్” సురక్షితంగా గమ్యం చేరుకోవడం అనే లక్ష్యంతో నెమ్మదిగా ప్రయాణించి, తమను తాము కాపాడుకుంటూ ఇతరులను కూడా ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఎస్పీ మీడియా ముఖ్యంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజపేటలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం.

**▶▶365 జాతీయ రహదారికి ఇరువైపుల నిర్మించిన ఇండ్ల పరిశీలన...**

**▶▶డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్ కుమార్..**

**▶▶అక్రమాలను గుర్తించిన చర్యలు తీసుకుంటాం...**



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట మండలం పరిధిలోని రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలో స్థానికేతరులు అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. రాజుపేట గ్రామపంచాయతీ ఏజెన్సీ పీసా చట్టంలో ఉన్నది. ఈ నేపథ్యంలో కొందరు పీసా చట్టానికి వ్యతిరేకంగా ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నారని వస్తున్న ఆరోపణలపై



డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్ కుమార్ గురువారం రాజుపేట గ్రామాన్ని సందర్శించి అక్రమ నిర్మాణాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజపేట గ్రామపంచాయతీ ఏజెన్సీ ప్రాంతం పిసా చట్టంలో పరిధిలో ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ పరిధిలో స్థానికులు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇంట్లో నిర్మాణం చేయడం,వ్యాపారాలు చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. రాజపేట గ్రామపంచాయతీ నర్సంపేట మున్సిపాలిటీ కి జాతీయ రహదారి కి ఆనుకొని ఉండటం పట్ల కొందరు ఇండ్లు వ్యాపార కార్యకలాపాలు కోసం నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. నర్సంపేట శివారు నుండి రాజుపేట గ్రామం వరకు 365 జాతీయ రహదారి కి ఇరువైపులా తదితర ప్రాంతాల్లో నిర్మాణాలు చేసిన ఇండ్ల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే కొన్ని ఇళ్లకు గ్రామపంచాయతీలో అనుమతులు ఇచ్చారని ఇటీవల కొన్ని ఇళ్లకు అనుమతులు ఇచ్చారని మరికొన్ని ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నాయని వీటికి ఏ విధంగా అనుమతులు ఇచ్చారు వాటి క్రైటేరియా పరిశీలించి సంబంధిత నివేదికలను జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు అందజేస్తూ చట్టపదపరమైన చర్యలు తీసుకుంటామని డిఎల్పిఓ రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. మండల పంచాయతీ అధికారి రామ్ మోహన్,గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్, స్థానిక సర్పంచ్ బదావత్ అఖిల శివకుమార్ తో కలిసి అక్రమ నిర్మాణాలను పరిశీలించిన డిఎల్పిఓ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తే వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాయపూరి శారద సూరయ్య, వార్డు మెంబర్ బానోతు రమేష్,అజ్మీరా వీరన్న, మాజీ ఎంపీటీసీ బాధవత్ వీరన్న, పలువురు ఉన్నారు.

# గణపురం పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ

**▶▶జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.**



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ గణపురం పోలీస్ స్టేషన్‌తో పాటు గణపురం సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్వహణ, పరిశుభ్రత, రికార్డులు, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించి, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూబాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనల నియంత్రణతో పాటు రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సీసీటీఎన్ఎస్ 2.0, ఈ–సాక్ష్య, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ తనిఖీల్లో భూపాలపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ సంపత్ రావు, ఘణపురం సీఐ కర్ణాకర్ రావు, ఎస్ఐ అశోక్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలతో భరోసా

**▶▶స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ...**

**▶▶పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు...**



**గుండాల, నేటిధాత్రి:** గుండాల మండలంలోని రైతు వేదిక నందు నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

**▶▶పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా....** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంతో పాటు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

**▶▶స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు మరింత ప్రయోజనం....** స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవడం, పేద కుటుంబాలకు భరోసా కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**▶▶కళ్యాణ లక్ష్మిషాదీ ముబారక్ పథకాలతో ఆడబిడ్డల వివాహాలకు చేయూత....** పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాల సమయంలో ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, పేద కుటుంబాల అభ్యున్నతికి తోడ్పడటం, గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంఆర్ఓ సంగీత, ఎంపీడీవో బాలరాజు, హౌసింగ్ ఏఈ రాజేష్, ఏవో వెంకటరమణ, ఎంపీవో త్రిలోక్, పంచాయతీ సెక్రటరీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పొంబోయిన ముత్తయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఊకె బుచ్చయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధార అశోక్ పాల్గొన్నారు. అలాగే పడుగొనిగూడెం సర్పంచ్ ఈసం సంజీవరావు, రోళ్లగడ్డ సర్పంచ్ బూక్య మంగమ్మ, శెంబునిగూడెం సర్పంచ్ ఈసం సుమలత, శెట్టుపల్లి సర్పంచ్ ఢిల్లీ వసంతరావు, దామరతోగు సర్పంచ్ కల్తి కృష్ణారావు, మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, మండల నాయకులు ఎస్కే అబ్దుల్ నభి, వంకుడోత్ బీకోజీ, బూక్య శ్రీను, ఎస్కే వాజీద్ పాషా, ఎస్కే కాసీం, పొలెబోయిన బాబురావు, వంకుడోత్ రమేష్, ఎస్కే ఇశ్రార్, బొంగు చంద్రశేఖర్, పల్లపు రాజేష్ పాల్గొన్నారు. వార్డు సభ్యులు ఈసం చంద్రయ్య, జాటోత్ వీరన్న, బానోత్ నరేందర్, బోడ వెంకట్రామ్‌తో పాటు ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో పారిశ్రామికవేత్తల పాత్ర కీలకం: కేంద్ర మంత్రి బన్వరీ లాల్ వర్మ

**▶▶దేశంలో 2.2 లక్షలకు చేరిన స్టార్టప్‌లు.. యువతకు కొత్త అవకాశాలు...**

**▶▶మహిళా సాధికారత, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం...**

**▶▶ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం...**




**శేరిలింగంపల్లి, నేటిధాత్రి:** 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే వికసిత్ భారత్ లక్ష్య సాధనలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి బన్వరీ లాల్ వర్మ అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మహిళా పారిశ్రామికవేత్తలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం కేవలం వ్యాపార కార్యకలాపాలకే పరిమితం కాకుండా దేశంలోని పారిశ్రామికవేత్తలను అనుసంధానించడానికి, కొత్త పెట్టుబడులను ఆకర్షించడానికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా బలమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందడంతోపాటు కొత్త వ్యాపార సంబంధాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**▶▶మహిళా సాధికారతకు ప్రాధాన్యం...** దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని బన్వరీ లాల్ వర్మ పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తూ, వారిని ‘లఖ్‌పతి దీదీ’లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యాపారం, సాంకేతికత, తయారీ, సేవా రంగాలతోపాటు డ్రోన్ల నిర్వహణ, యుద్ధ విమానాల నడపడం, వందేభారత్ రైళ్ల నిర్వహణ వంటి విభిన్న రంగాల్లో మహిళలు తమ సామర్థ్యాన్ని చాటుతున్నారని కొనియాడారు.

**▶▶ఎంఎస్ఎంఈలతో ఉపాధి కల్పన...** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివని కేంద్ర మంత్రి అన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడంలో, చిన్న వ్యాపారాలను ప్రోత్సహించడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. చిన్న పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు కల్పించడంతోపాటు పారదర్శకత, విశ్వసనీయత, బాధ్యతాయుతమైన వ్యాపార విధానాలను ప్రోత్సహించాలని సూచించారు. వికసిత్ భారత్--2047 లక్ష్యం ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరి సంకల్పం మాత్రమే కాదని, 140 కోట్ల మంది భారతీయుల సమష్టి లక్ష్యమని బన్వరీ లాల్ వర్మ అన్నారు. ప్రతి పౌరుడు అభివృద్ధి దిశగా ఒక్క అడుగు వేస్తే దేశం 140 కోట్ల అడుగులు ముందుకు సాగుతుందని ప్రధాని చెప్పే మాటలను ప్రస్తావించారు. ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు సమన్వయంతో పనిచేస్తే దేశ ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతోపాటు సాంకేతిక రంగంలోనూ భారత్ మరింత శక్తిమంతంగా ఎదుగుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా యువతకు పారిశ్రామిక అవకాశాలు పెరగాలని, కొత్త ఆలోచనలకు కార్యరూపం దక్కాలని ఆకాంక్షించారు. సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తోపాటు కార్యక్రమ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

**▶▶2.2 లక్షలకు చేరిన స్టార్టప్‌లు...** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో స్టార్టప్‌ల రంగం గణనీయంగా విస్తరించిందని బన్వరీ లాల్ వర్మ తెలిపారు. 2014లో దేశవ్యాప్తంగా సుమారు 350 స్టార్టప్‌లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.2 లక్షలకు చేరిందన్నారు. యువత కేవలం ఉద్యోగాలు పొందే స్థాయిలోనే కాకుండా, ఇతరులకు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికత, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ భారతీయ పరిశ్రమలను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించాలని సూచించారు.

**▶▶ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్...** 2014లో ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ‘సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్’ నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ దిశగా చేపట్టిన చర్యలతో 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడేందుకు అవకాశం కలిగిందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా బలోపేతమైందని, ప్రపంచంలోని అగ్ర ఆర్థిక వ్యవస్థల్లో భారత్ స్థానం సంపాదించిందని తెలిపారు. రానున్న కాలంలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలబెట్టాలన్న లక్ష్యాన్ని విశ్వాసంతో సాధిస్తామని అన్నారు.

# లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో అమ్మవారి దర్శనం



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పూజా కార్యక్రమాలను అర్చకులు వినయ్ నిర్వహించారు.

# బతుకమ్మ వేడుకలకు విద్యుత్ వెలుగులు



**▶▶బసన్న చెరువు కట్టపై విద్యుత్ స్తంభాల ఏర్పాటు...**

**గీసుగొండ, నేటిధాత్రి:** సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బసన్న చెరువు కట్టపై విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మహిళలు, భక్తులు పండుగ వేడుకల్లో సౌకర్యవంతంగా పాల్గొనేలా ఈ ఏర్పాట్లు చేపట్టారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు చెరువు కట్ట వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు. పండుగ సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోట ప్రమోద్, గ్రామ కార్యదర్శి పోలూ రాజేంద్రప్రసాద్, కరోబార్ ఎండీ అలీ, మాజీ సర్పంచ్ దౌడు బాబు, సొసైటీ డైరెక్టర్ దౌడు సునీల్, వార్డు సభ్యురాలు యాదగిరి స్వప్న అశోక్, మాజీ వార్డు సభ్యుడు దౌడు రాజేష్, మహమ్మద్ సోనీ, యాదగిరి కుమార్, టైగర్ రాజు, పసుల శివన్నారాయణ, ఓదెల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కేటీపీపీలో రంగురంగుల పూల బతుకమ్మ సంబరాలు

**▶▶సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన మహిళలు....**



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం కెటిపిపి లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కేటీపీపీ చీఫ్ ఇంజనీర్ చిట్టప్రగడ ప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. కోలాటాలు, సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ చిట్టప్రగడ ప్రకాష్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యత, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగులు, వారి కుటుంబాల మధ్య ఆత్మీయతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేటీపీపీ అధికారులు, ఉద్యోగులు, మహిళలు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో కేటీపీపీలో పండుగ వాతావరణం నెలకొంది.

# బతుకమ్మ ఆటస్థలాన్ని పరిశీలించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు



**డెస్క్, నేటిధాత్రి:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ ఎనుమాముల రామలీల మైదానం ప్రాంతంలో బతుకమ్మ ఆటస్థలాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు పరిశీలించారు. అనంతరం అక్కడ చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. పమహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్, మాజీ కార్పొరేటర్ సులోచన సారయ్య, ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ చైర్ సిలువేరు శ్రీనివాస్, సీనియర్ నాయకులు జానీ,రాజేష్, మహేష్, సుధీర్, చంద్రశేఖర్, స్టాలిన్, కుమార్, రవి, సజియా బేగం, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

**▶▶కలెక్టర్ స్పందించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.**

**▶▶అన్నారపు సాయికుమార్...**



**సిరిసిల్ల, నేటిధాత్రి:** సిరిసిల్ల పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని సామాజిక కార్యకర్త అన్నారం సాయికుమార్ డిమాండ్ చేశారు.

ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్ల పట్టణానికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రయాణికులు వస్తుంటారని, సరైన మరుగుదొడ్ల సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ సమీపంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం అత్యవసరమని అన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణ పనులు ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని అన్నారం సాయికుమార్ విజ్ఞప్తి చేశారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....






మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999


సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034



## కాఫీతో గుండెకు రక్ష

మారిన జీవనశైలిలో గుండె జబ్బుల ముప్పు నానాటికీ పెరుగుతున్నది. అయితే, మనం రోజూ తాగే కాఫీ గుండెను పదిలంగా ఉంచుతుందని సరికొత్త పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. రోజుకు రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగడం వల్ల గుండె జబ్బుల ముప్పు గణనీయంగా తగ్గుతుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ బేకర్ హార్ట్ అండ్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఈ ప్రతిష్ఠాత్మక పరిశోధనను నిర్వహించారు. బ్రిటన్‌కు చెందిన 'యూకే బయోబ్యాంక్' నుంచి సేకరించిన దాదాపు నాలుగున్నర లక్షల మంది డేటాను విశ్లేషించి ఈ అంచనాకు వచ్చారు. దాదాపు పన్నెండున్నర సంవత్సరాల పాటు వీరి ఆరోగ్య అలవాట్లను, కాఫీ వినియోగాన్ని పరిశోధకులు నిశితంగా గమనించారు. ఈ సుదీర్ఘ అధ్యయనంలో ఆశ్చర్యకరమైన నిజాలు వెలుగుచూశాయి.

రోజుకు 2-3 కప్పుల కాఫీ తాగే వారిలో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం, కాఫీ తాగని వారి కంటే 20% తక్కువగా ఉన్నట్లు తేలింది. గ్రౌండ్ కాఫీ, ఇన్‌స్టంట్ కాఫీ లేదా డీకాఫిన్ అంటే కెఫిన్ తీసేసిన కాఫీ... రకం ఏదైనా సరే, కాఫీ క్రమం తప్పకుండా తాగే వారిలో అకాల మరణాల రేటు చాలా తక్కువగా ఉంది. ఇక, కాఫీలో కేవలం కెఫిన్ మాత్రమే కాదు, శరీరంలో వాపులను తగ్గించే, జీవక్రియలను మెరుగుపరిచే 100కు పైగా జీవసంబంధిత సమ్మేళనాలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. అయితే... చక్కెర, పాలు అతిగా లేకుండా బ్లాక్ కాఫీ లేదా తక్కువ మోతాదు పాలతో తీసుకుంటే ఈ ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నిజజీవితంలో ఎంతో ఉపయోగపడే ఈ పరిశోధన, కాఫీ ప్రియులకు ఒక తీపి కబురనే చెప్పాలి!

## ఆరోగ్యమే మహాభాగ్యం..

### ఆరోగ్యంగా ఉండాలంటే ఈ 10 అలవాట్లు తప్పనిసరి



నేటి వేగవంతమైన జీవనశైలిలో మహిళలు ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ సంరక్షణ, గృహ నిర్వహణ వంటి అనేక పనులను ఒకేసారి నిర్వహిస్తుంటారు. ఈ నిరంతర మానసిక ఒత్తిడి, బాధ్యతల కారణంగా మహిళల శరీరం, ముఖ్యంగా మెదడు, పురుషులతో పోలిస్తే ఎక్కువ విశ్రాంతిని కోరుకుంటుందని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే మహిళలకు సాధారణంగా పురుషుల కంటే కొంత ఎక్కువ నిద్ర అవసరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. నిపుణుల ప్రకారం పెద్దలకు రోజుకు సగటున 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం. అయితే మహిళలు రోజంతా అనేక బాధ్యతలను సమన్వయం చేయాల్సి రావడంతో వారి మెదడు ఎక్కువగా పనిచేస్తుంది. ఈ కారణంగా మెదడు పూర్తిగా కోలుకోవడానికి అదనంగా 20 నుంచి 60 నిమిషాల నిద్ర అవసరమయ్యే అవకాశం ఉందని అధ్యయనాలు వెల్లడించాయి.

**మానసిక శ్రమ ఎక్కువ..**

పరిశోధనల ప్రకారం రోజంతా ఎక్కువ మానసిక శ్రమ చేసినప్పుడు మెదడుకు రాత్రి సమయంలో మరింత విశ్రాంతి అవసరం అవుతుంది. మహిళలు సాధారణంగా ఒకేసారి అనేక పనులను నిర్వహించడం వల్ల మెదడులోని వివిధ భాగాలు ఎక్కువగా చురుకుగా పనిచేస్తాయి. గాఢ నిద్ర సమయంలో ఈ భాగాలు మరమ్మత్తులు చేసుకుని తదుపరి రోజుకు సిద్ధమవుతాయి. నిద్ర సమయం తగ్గితే ఈ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. మహిళల నిద్రపై హార్మోన్ల ప్రభావం కూడా గణనీయంగా ఉంటుంది. రుతుచక్ర సమయంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ స్థాయిల్లో మార్పులు రావడం వల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. గర్భధారణ సమయంలో శారీరక అసౌకర్యం, గుండె స్పందన పెరగడం, శిశువు కదలికలు వంటి కారణాలతో నిద్ర మధ్యలో పలుమార్లు మెళకువ వస్తుంది. అలాగే మెనోపాజ్ దశలో హార్మోన్ల తగ్గుదల వల్ల రాత్రిపూట చెమటలు, నిద్రలేమి వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది.

**సరిపడా నిద్ర పొందితేనే..**

సరిపడా నిద్ర పొందినప్పుడు మహిళల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. భావోద్వేగ నియంత్రణ సులభమవుతుంది. అలాగే ఆకలి, తృప్తిని నియంత్రించే హార్మోన్లు సమతుల్యంగా పనిచేయడంతో బరువు నియంత్రణకు కూడా సహాయపడుతుంది. శరీరం శక్తిని సమర్థవంతంగా వినియోగించుకునే సామర్థ్యం పెరుగుతుంది. అవసరమైన నిద్రను తరచూ తగ్గించుకోవడం వల్ల మొదట అలసట, చిరాకు, ఏకాగ్రత లోపం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు కనిపిస్తాయి. దీర్ఘకాలంలో ఆందోళన, డిప్రెషన్, బరువు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

**నిద్రలేమి సంకేతాలు ఇవే..**

తీవ్రమైన నిద్రలేమికి కొన్ని హెచ్చరిక సంకేతాలు కూడా ఉంటాయి. మధ్యాహ్నం సమయంలో అధిక అలసట, తీపి లేదా అధిక కేలరీల ఆహారాలపై తీవ్రమైన కోరిక, చిన్న విషయాలకే చిరాకు, మంచంపై చాలాసేపు గడిపినా ఉదయం తాజాగా అనిపించకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా పెద్దలకు 7 నుంచి 9 గంటల నిద్ర అవసరమైనప్పటికీ, చాలా మంది మహిళలకు 8 నుంచి 8.5 గంటల నాణ్యమైన నిద్ర లభిస్తే శరీరం, మెదడు పూర్తిగా పునరుద్ధరించుకునే అవకాశం ఉంటుంది. అందుకే నిద్రను విలాసంగా కాకుండా ఆరోగ్యానికి అత్యవసరమైన అవసరంగా భావించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిద్ర నాణ్యతను మెరుగుపరచాలంటే ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవడం, ఒకే సమయంలో లేవడం అలవాటు చేసుకోవాలి. నిద్రకు గంట ముందు మొబైల్, టాబ్లెట్ వంటి పరికరాల వినియోగాన్ని తగ్గించాలి. సాయంత్రం తర్వాత కెఫీన్, మద్యం, భారమైన ఆహారాన్ని పరిమితం చేయడం మంచిది. అలాగే పడకగది ఉష్ణోగ్రతను చల్లగా ఉంచడం ద్వారా గాఢ నిద్రకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

## వేసవిలో మునగాకుతో కలిగే అద్భుత ప్రయోజనాలు.. తెలిస్తే అస్సలు వదలరు

ఇంటర్నెట్ డెస్క్: సాధారణంగా మునగ కాయలను మనం ఎంతో ఇష్టంగా తింటాం. కానీ, మునగాకులోని ఆరోగ్య రహస్యాలను చాలా మంది పట్టించుకోరు. మునగాకు వేసవి కాలంలో శరీరానికి ఒక వరప్రసాదం లాంటిది. ఎండల వేడిని తట్టుకోవడమే కాకుండా, శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. మునగ ఆకు వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలు ఎంటో తెలుసుకుందాం.

**1. శరీరానికి చలవ:**

మునగాకులో సహజసిద్ధమైన చలవ చేసే గుణాలు మెండుగా ఉన్నాయి. వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరగకుండా నియంత్రించడంలో ఇది సహాయపడుతుంది. దీనివల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం తగ్గుతుంది.

**2. శక్తినిచ్చే పవర్‌హౌస్:**

వేసవిలో అధిక చెమట వల్ల మనం త్వరగా అలసిపోతాం. మునగాకులో ఉండే ఐరన్, క్యాల్షియం, విటమిన్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. నీరసాన్ని తగ్గించి రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి.

**3. రోగనిరోధక శక్తి పెంపు:**

వేసవిలో ఆహారం త్వరగా పాడవడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. మునగాకులో ఉండే విటమిన్-సి రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేసి, ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని కాపాడుతుంది.

**4. జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**

మునగ ఆకులో పీచు పదార్థం పుష్కలంగా ఉంటుంది. ఇది వేసవిలో వచ్చే మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలను దూరం చేస్తుంది. పొట్టను శుభ్రంగా ఉంచుతుంది.

**5. చర్మ సౌందర్య:**

ఎండ వల్ల చర్మం కమిలిపోవడం సహజం. మునగాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను రక్షించి, చర్మం ప్రకాశవంతంగా ఉండేలా చేస్తాయి.

**6. మునగాకుతో విటమిన్ సి:**

విటమిన్ సి అధికంగా ఉన్న పదార్థాలు అంటే నిమ్మకాయ, ఉసిరికాయ, నారింజ వంటి పండ్లతో మునగాకు కలిపి తీసుకుంటే చాలా మంచిది. మునగాకు పొడి చేసుకొని అందులో కాసింత నిమ్మరసం కలుపుకొని తీసుకుంటే రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం.

**7. మిరియాలతో మునగాకు:**

మిరియాలలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. మునగాకుతో మిరియాలు కలిపి తీసుకుంటే న్యూట్రియెంట్స్ రెట్టింపవుతాయి. పొడిగా చేసుకొనేటప్పుడు అందులో కొన్ని మిరియాలు కలుపుకుంటే బాగుంటుంది.

**మునగ ఆకును ఎలా తీసుకోవాలి?**

వారానికి రెండు సార్లు పప్పులో కానీ, ఇతర కూరల్లో మునగాకు వేసుకొని తింటే మంచిది.

ఎండబెట్టిన ఆకును పొడి చేసి మజ్జిగలో కలుపుకుని తాగితే వేసవి వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది.

పరగడుపున మునగ ఆకుల డికాషన్ తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది



గమనిక: ఇందులోని సమాచారం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ వనరుల ఆధారంగా పాఠకులకు అందించడం జరుగుతోంది. ఈ సమాచారాన్ని నేటిధాత్రి స్వతంత్రంగా ధ్రువీకరించలేదు.

## వెల్లుల్లితో ఎన్ని లాభాలో.. విరిగిన ఎముకలతో సహా..

ఏ మహామూలిక గుండెజబ్బులకు గొప్ప ఔషధమో, కుష్ఠు సహా అన్ని చర్మవ్యాధులకు నివారకమో, పక్షవాతం మొదలుకొని నరాల వ్యాధులన్నింటికీ ఉపశమనమో... విరిగిన ఎముకలతో సహా సమస్త ఎముక వ్యాధులను ఎదుర్కొనే శక్తిని కలిగిస్తుందో, సంతానాన్నిస్తుందో లైంగిక సమర్థతని పెంచుతుందో ఆ మహౌషధి... వెల్లుల్లికి దణ్ణాలు.

**ఇమ్యూనిటీ బూస్టర్ వెల్లుల్లి**

కాశ్యపసంహిత వైద్యగ్రంథంలో 'లశునకల్పం' అనే అధ్యాయమే ఉంది. వెల్లుల్లి ఆయుష్షును పెంచుతుంది, ఊపిరితిత్తుల్లో పేరిన కఫాన్ని కరిగిస్తుంది. జీర్ణశక్తిని, బలాన్ని, లైంగిక శక్తిని పెంపొందిస్తుంది. ఈ కారణాల వల్లే ఆయుర్వేదం వెల్లుల్లిని అమృతంతో సమా నం అన్నది! జీవశక్తినిచ్చే రెజువెనేటర్ వెల్లుల్లి.

వెల్లుల్లి నోటిదుర్వాసనను తగ్గించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది.



కొవ్వును నియంత్రిస్తుంది. దంతాలు, కండరాలు, గోళ్లు, వెంట్రుకలు బల పడేలా చేసి శరీర వర్ణాన్ని మెరుగుపరుస్తుంది. రక్తప్రసరణను, నాడీవ్యవస్థను ఉత్తేజితం చేస్తుంది. అలాగే స్త్రీ-పురుషులలో సంతాన వ్యవస్థను బలపరచి సంతానప్రాప్తికి సహాయ పడుతుంది. మేధస్సు పెరుగుతుంది. కంఠస్వరం మెరుగవుతుంది.

పాలలో ఉడికించిన వెల్లుల్లి తాగితే ఆస్తమా తగ్గుతుంది. క్షయ, న్యుమోనియాలో కఫాన్ని కరిగించి శ్వాస సులభం చేస్తుంది. వెల్లుల్లి రసాన్ని వేడి నీటితో తీసుకుంటే ఉబ్బసం, దగ్గు, ఆయాసం తగ్గుతాయి.

**ఔషధంలా తినాలి!**

వెల్లుల్లిని ఔషధంగా తీసుకున్నప్పుడే దాని ప్రయోజనాలు దక్కుతాయి. రోజుకు రెండు రెబ్బలు ఎక్కువలో ఎక్కువ మోతాదుఅంతకు మించకుండా ఉంటేనే ఆరోగ్యానికి మంచిది. మితిమీరితే ప్రయోజనానికి బదులు హాని కలుగుతుంది. బీ-కాంప్లెక్స్ మాత్ర రోజుకొక్కటి వేసుకుంటే బలం. అంతకన్నా ఎక్కువ మింగితే ఎలా ప్రమాదకరమో, అలాగే వెల్లుల్లి అతిగా తింటే గుండె, చర్మం, నరాలు, సంతాన యోగ్యత, లైంగిక సామర్థ్యానికి హాని కలిగించవచ్చు.

ఒక మనిషికి రోజుకు 1-2 రెబ్బల వెల్లుల్లి ఎక్కువలో ఎక్కువ మోతాదు. అంతకన్నా ఎక్కువగా తినవద్దనే సూచన! వంటకాల్లో వెల్లుల్లి తిననివారు భోంచేశాక 1-2 రెబ్బలు పొట్టు వలిచి, నమలకుండా మింగేయవచ్చు!

**అమృతమే కానీ...**

దేవతల అమృతం భూమిపై చింది వెల్లుల్లి మొలిచిందని ఐతిహ్యం. అది అశుభ్రమైన చోట పడటాన దానికి దుర్వాసన ఏర్పడిందని కథ. సుగంధ ద్రవ్యాలలో వెల్లుల్లి ఉగ్రగంధి. మాంసంలోని దుర్వాసన తొలగించేందుకు ఉపయోగపడ్తుంది. కూరగాయలకు అలాంటి వాసనలేవీ ఉండవు కాబట్టి, శాకాహారంలో దీనికి అంత అవసరం లేదని భావించి శ్రోత్రియులు, శుద్ధ శాకాహారులు సాధారణంగా వెల్లుల్లి వాడరు. "వెల్లుల్లిం దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా" అంటూ వెల్లుల్లి వేసి వండిన తెలికిపిండిని విధవరాలు వడ్డిస్తుంటే తినాల్సి వచ్చిన దౌర్భాగ్యానికి బాధపడ్డాడు శ్రీనాథుడు.

నేటి కాలంలో విచిత్రంగా వెల్లుల్లి వాడకం మితిమీరింది. ఆఖరికి ఇడ్లీచట్నీలో కూడా వెల్లుల్లి కలిపేస్తున్నారు. రేపు ఇడ్లీలో వెల్లుల్లి కలిపినా ఆశ్చర్యం లేదు. అవధులు దాటిన వేలంవెర్రి ప్రమాదకరం. వెల్లుల్లి అతిగా తిన్న వ్యక్తుల శరీరం నుంచి వెలువడే గవులుకంపు ఇతరులకు చాలా ఇబ్బంది కలిగిస్తుంది. పౌర సంబంధమైన వృత్తుల్లో ఉన్నవారి కెరీర్‌ని కూడా అది దెబ్బతీస్తుంది.

వెల్లుల్లి మొదట ఔషధ ద్రవ్యమే! వంటిల్లు వెల్లుల్లికి సొంతిల్లు కాదు! 4,500 సంవత్సరాల క్రితం ఈజిప్టు పిరమిడ్ల నిర్మాణ కాలంలో కార్మికులంతా బలం, ఆరోగ్యం కోసం వెల్లుల్లి తప్పనిసరిగా తినాలని ఒక రాజాజ్ఞ ఉండేదట! అలా వంట గదిలోకి ప్రవేశించింది వెల్లుల్లి. ఆహార పదార్థాల్లో అత్యవసరం అయితేనే వెల్లుల్లిని చేర్చండి. కమ్మగా ఉండే వంటకాల సహజ పరిమళాన్ని వెల్లుల్లి కమ్మేస్తుంది. ఏ కూరతిన్నా వెల్లుల్లి రుచే! అందువలన కూర గాయల సహజ పరిమళాన్ని, రుచిని ఆస్వాదించలేకపోతున్నాం! అతి సర్వత్రా వర్జయేత్ కదా!

– డా. జి వి పూర్ణచందు, 9440172642

## పురుషుల కన్నా మహిళలకు నిద్ర కాస్త ఎక్కువ అవసరం.. ఎందుకంటే..?

నేటి వేగవంతమైన జీవనశైలిలో మహిళలు ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ సంరక్షణ, గృహ నిర్వహణ వంటి అనేక పనులను ఒకేసారి నిర్వహిస్తుంటారు. ఈ నిరంతర మానసిక ఒత్తిడి, బాధ్యతల కారణంగా మహిళల శరీరం, ముఖ్యంగా మెదడు, పురుషులతో పోలిస్తే ఎక్కువ విశ్రాంతిని కోరుకుంటుందని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే మహిళలకు సాధారణంగా పురుషుల కంటే కొంత ఎక్కువ నిద్ర అవసరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. నిపుణుల ప్రకారం పెద్దలకు రోజుకు సగటున 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం. అయితే మహిళలు రోజంతా అనేక బాధ్యతలను సమన్వయం చేయాల్సి రావడంతో వారి మెదడు ఎక్కువగా పనిచేస్తుంది. ఈ కారణంగా మెదడు పూర్తిగా కోలుకోవడానికి అదనంగా 20 నుంచి 60 నిమిషాల నిద్ర అవసరమయ్యే అవకాశం ఉందని అధ్యయనాలు వెల్లడించాయి.

**మానసిక శ్రమ ఎక్కువ..**

పరిశోధనల ప్రకారం రోజంతా ఎక్కువ మానసిక శ్రమ చేసినప్పుడు మెదడుకు రాత్రి సమయంలో మరింత విశ్రాంతి అవసరం అవుతుంది. మహిళలు సాధారణంగా ఒకేసారి అనేక పనులను నిర్వహించడం వల్ల మెదడులోని వివిధ భాగాలు ఎక్కువగా చురుకుగా పనిచేస్తాయి. గాఢ నిద్ర సమయంలో ఈ భాగాలు మరమ్మత్తులు చేసుకుని తదుపరి రోజుకు సిద్ధమవుతాయి. నిద్ర సమయం తగ్గితే



ఈ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. మహిళల నిద్రపై హార్మోన్ల ప్రభావం కూడా గణనీయంగా ఉంటుంది. రుతుచక్ర సమయంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ స్థాయిల్లో మార్పులు రావడం వల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. గర్భధారణ సమయంలో శారీరక అసౌకర్యం, గుండె స్పందన పెరగడం, శిశువు కదలికలు వంటి కారణాలతో నిద్ర మధ్యలో పలుమార్లు మెళకువ వస్తుంది. అలాగే మెనోపాజ్ దశలో హార్మోన్ల తగ్గుదల వల్ల రాత్రిపూట చెమటలు, నిద్రలేమి వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది.

**సరిపడా నిద్ర పొందితేనే..**

సరిపడా నిద్ర పొందినప్పుడు మహిళల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. భావోద్వేగ నియంత్రణ సులభమవుతుంది. అలాగే ఆకలి, తృప్తిని నియంత్రించే హార్మోన్లు సమతుల్యంగా పనిచేయడంతో బరువు నియంత్రణకు కూడా సహాయపడుతుంది. శరీరం శక్తిని సమర్థవంతంగా వినియోగించుకునే సామర్థ్యం పెరుగుతుంది. అవసరమైన నిద్రను తరచూ తగ్గించుకోవడం వల్ల మొదట అలసట, చిరాకు, ఏకాగ్రత లోపం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు కనిపిస్తాయి. దీర్ఘకాలంలో ఆందోళన, డిప్రెషన్, బరువు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

**నిద్రలేమి సంకేతాలు ఇవే..**

తీవ్రమైన నిద్రలేమికి కొన్ని హెచ్చరిక సంకేతాలు కూడా ఉంటాయి. మధ్యాహ్నం సమయంలో అధిక అలసట, తీపి లేదా అధిక కేలరీల ఆహారాలపై తీవ్రమైన కోరిక, చిన్న విషయాలకే చిరాకు, మంచంపై చాలాసేపు గడిపినా ఉదయం తాజాగా అనిపించకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా పెద్దలకు 7 నుంచి 9 గంటల నిద్ర అవసరమైనప్పటికీ, చాలా మంది మహిళలకు 8 నుంచి 8.5 గంటల నాణ్యమైన నిద్ర లభిస్తే శరీరం, మెదడు పూర్తిగా పునరుద్ధరించుకునే అవకాశం ఉంటుంది. అందుకే నిద్రను విలాసంగా కాకుండా ఆరోగ్యానికి అత్యవసరమైన అవసరంగా భావించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిద్ర నాణ్యతను మెరుగుపరచాలంటే ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవడం, ఒకే సమయంలో లేవడం అలవాటు చేసుకోవాలి. నిద్రకు గంట ముందు మొబైల్, టాబ్లెట్ వంటి పరికరాల వినియోగాన్ని తగ్గించాలి. సాయంత్రం తర్వాత కెఫీన్, మద్యం, భారమైన ఆహారాన్ని పరిమితం చేయడం మంచిది. అలాగే పడకగది ఉష్ణోగ్రతను చల్లగా ఉంచడం ద్వారా గాఢ నిద్రకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

# 85 నిమిషాల్లో బెంగళూరుకు.. 33 రోజుల చికిత్సతో శిశువుకు పునర్జన్మ!

▸▸మదనపల్లె నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలింపు...

▸▸తీవ్ర శ్వాసకోశ సమస్యలను అధిగమించిన నవజాత శిశువు...



**బెంగళూరు, నేటిధాత్రి:** తీవ్ర శ్వాసకోశ సమస్యలతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న నవజాత ఆడ శిశువుకు బెంగళూరులోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లె నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో కేవలం 85 నిమిషాల్లోనే శిశువును ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్యం అందించారు. అనంతరం 33 రోజులపాటు చికిత్స అందించడంతో చిన్నారి కోలుకుని ఇంటికి చేరింది. ఈ వివరాలను ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

**▸▸పుట్టిన వెంటనే ప్రాణాపాయం...** మదనపల్లెకు చెందిన బలే రజని ప్రసవించిన ఆడ శిశువు పుట్టిన వెంటనే తీవ్ర శ్వాసకోశ సమస్యలకు గురైంది. శిశువు ఊపిరితిత్తుల్లోకి మలం చేరడం, గాలి లీకేజీ కారణంగా ఊపిరితిత్తులు సరిగా పనిచేయకపోవడంతో పరిస్థితి విషమించింది. దీంతో అత్యాధునిక ప్రాణరక్షణ సదుపాయాలున్న ప్రత్యేక అంబులెన్స్‌లో మదనపల్లె నుంచి బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు.

**▸▸అత్యాధునిక చికిత్సతో కోలుకున్న చిన్నారి...** శిశువు ఆసుపత్రికి చేరుకునే సమయానికి శ్వాసకోశ వ్యవస్థ, రక్తపోటు తీవ్రంగా క్షీణించాయని సీనియర్ వైద్యులు డాక్టర్ శివశంకర్ దిగ్గిక్కర్, డాక్టర్ లతీష్ తెలిపారు. వెంటనే నవజాత శిశువుల ప్రత్యేక చికిత్స విభాగంలో చేర్చి, అత్యాధునిక కృత్రిమ శ్వాస చికిత్స, ఇన్హేల్డ్ నైట్రిక్ ఆక్సైడ్, ద్రవాల చికిత్స అందించినట్లు వివరించారు. స్వరపేటిక మృదుత్వం సహా పలు శ్వాసకోశ సమస్యలను అధిగమించేలా 33 రోజులపాటు నిరంతర వైద్య సేవలు అందించామన్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా కోలుకుందని పేర్కొన్నారు.

**▸▸త్వరలో పిల్లల గుండె వైద్య విభాగం...** ఆసుపత్రి ప్రాంతీయ డైరెక్టర్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ, అత్యంత క్లిష్టమైన ఈ కేసును తమ వైద్య బృందం విజయవంతంగా నిర్వహించిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి చిన్నారి ప్రాణాలను కాపాడగలిగామని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతంలో మరింత అధునాతన పిల్లల గుండె వైద్య విభాగాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

**▸▸తల్లిదండ్రుల్లో ఆనందం...** 33 రోజులపాటు తమ బిడ్డ ప్రాణాల కోసం ఎదురుచూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చిన్నారి కోలుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో అంబులెన్స్ ఏర్పాటు చేసి, బిడ్డను కంటికి రెప్పలా చూసుకున్న వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆసుపత్రి కేంద్రాధిపతి శ్రీవల్లి, వైద్యులు డాక్టర్ శివశంకర్ దిగ్గిక్కర్, డాక్టర్ లతీష్, ప్రాంతీయ డైరెక్టర్ సిద్ధారెడ్డి, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

▸▸ఇంటింటి నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కొండేటి శ్రీధర్...

▸▸ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచన...



**వర్ధన్నపేట, నేటిధాత్రి:** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సూచించారు. గోపాలపూర్ మండల జోనల్ కమిటీ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పరిమళ కాలనీలోని శ్రీ చక్రధర్ నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

**▸▸అర్హతలు ఇవే..** 2023 అక్టోబరు 31 నాటికి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కొండేటి శ్రీధర్ తెలిపారు. సంబంధిత విశ్వవిద్యాలయం లేదా విద్యాసంస్థ జారీ చేసిన డిగ్రీ ధ్రువపత్రం, మార్కుల జాబితా లేదా తాత్కాలిక ధ్రువపత్రం కలిగి ఉండాలని వివరించారు. సంబంధిత ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో నివసిస్తున్న అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు.

**▸▸కొత్తగా ఓటరు జాబితా తయారీ...** గతంలో ఓటరుగా నమోదై ఉన్నప్పటికీ, పాత జాబితాలోని వివరాల ఆధారంగా ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేరు కొనసాగుతుందని భావించరాదని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికకు కొత్త ఓటరు జాబితా రూపొందిస్తారని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకుని, ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్, భాజపా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి అమృతరావు, జిల్లా కార్యదర్శి పోనగాటి వెంకట్రావు, ఉపాధ్యక్షుడు కాయితోజు అఖిలేష్, జిల్లా సీనియర్ నాయకులు నాగవల్లి రమేష్, గుంటి నవీన్, చింతలపాని అమరేందర్‌రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, యువమోర్చా మండల అధ్యక్షుడు చింతల శ్రీకాంత్ యాదవ్, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం




▸▸పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు....

▸▸మడికొండలో ఎన్నికల సన్నాహక సమావేశం...

**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. మడికొండలోని శ్రీ సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సరోత్తం రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.

**▸▸పట్టభద్రులకు ప్రభుత్వ పథకాలను వివరించాలి....** ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయంపై దృష్టి సారించాలని సూచించారు. పట్టభద్రులను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు. పట్టభద్రుల సమస్యలు, వారి ఆకాంక్షలను తెలుసుకుని ప్రజల్లోకి వెళ్లాలని తెలిపారు.

**▸▸పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం....** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమం, యువత అభ్యున్నతి, విద్యావంతుల ఆకాంక్షల సాధనకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని నాగరాజు పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. నియోజకవర్గాల వారీగా నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టాలని సూచించారు.

**▸▸దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలి...** సామాజిక మాధ్యమాల్లో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై, సంక్షేమ పథకాలపై జరుగుతున్న ప్రచారానికి సంబంధించి వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండలో డీ స్టూడియో బ్యూటీ పార్లర్ ప్రారంభం.

▸▸బతుకమ్మ, దసరా పండుగలకు 25 శాతం రాయితీ.. డాక్టర్ అరుణారఘు...

▸▸మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం.. ▸▸దీక్ష గ్రూప్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు..



**హనుమకొండ, నేటిధాత్రి:** దీక్ష గ్రూప్స్ ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన డి స్టూడియో బ్యూటీ పార్లర్‌ను ప్రారంభించారు. డి స్టూడియో అధినేత్రి డాక్టర్ అరుణ రఘు నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ సంస్థ ట్రై సిటీలో అతిపెద్ద బ్యూటీ పార్లర్‌గా రూపుదిద్దుకుంది. దీక్ష గ్రూప్స్ గత 20 సంవత్సరాలుగా బ్యూటీ పార్లర్ రంగంలో సేవలు అందిస్తూ, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ప్రస్తుతం డి స్టూడియో ద్వారా సుమారు 20 నుంచి 30 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి సంస్థలు దోహదపడుతున్నాయి. డీ స్టూడియోలో హెయిర్ కటింగ్స్, బ్యూటీషియన్ సేవలు, పురుషులకు హెయిర్ కటింగ్స్, స్కిన్ కేర్, మేకప్ తదితర వివిధ రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా సంస్థను నిర్వహిస్తున్నారు. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని వినియోగదారులకు ప్రత్యేకంగా 25% డిస్కౌంట్ ప్రకటించారు. ఈ అవకాశాన్ని మహిళలు, యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.



# మాదాపూర్లో రూ. 400ల కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

▸▸రెండు ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్...

▸▸రెవెన్యూ అధికారుల వినతి మేరకు హైడ్రా చర్యలు...




**హైదరాబాద్, నేటిధాత్రి:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్లోని ఖనమేట్ గ్రామంలో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఆక్రమణదారుల చేతిలో ఉన్న రూ. 400 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని గురువారం కాపాడింది. 2 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది. ఈ భూమిని కబ్జా చేసిన






వాళ్లకు కోర్టులో కూడా చుక్కెదురైంది. ఈ భూమిని కాపాడడానికి రెవెన్యూ అధికారులు ప్రయత్నించినప్పుడు ప్రతిఘటన ఎదురయ్యింది. అక్కడ ప్రహరీ నిర్మించి ఆక్రమించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అయినా ఎప్పటికప్పుడు ఆక్రమించడానికి ఒకరితో ఒకరు పోటీపడ్డారు. తాజాగా 2 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ ఆక్రమణ దారులు బ్లూ షీట్స్ ఫెన్సింగ్ వేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు గురువారం రంగంలోకి దిగి ఆక్రమణదారులు వేసిన బ్లుషీట్లను తొలగించారు. రెండు ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేశారు. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు.

# మఠంపల్లిలో మొబైల్ చోరీ.. అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్!

▸▸చోరీ కేసును ఛేదించిన పోలీసులు.. ఆరు స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం...

▸▸తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యం.. రూ. 80 వేల విలువైన ఫోన్ల రికవరీ...




**సూర్యాపేట/ మఠంపల్లి, నేటిధాత్రి:** మండల కేంద్రంలోని మొబైల్ దుకాణంలో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర నిందితుడిని మఠంపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ. 80 వేల విలువైన ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమంద రాజు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు.

**▸▸తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యం....** గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన చక్రవర్తి అలియాస్ బాబు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, చైతన్యపురి పరిధిలో ఒకటి, కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చోరీ కేసులు నమోదయ్యాయి. 2023లో కోదాడ టౌన్ పరిధిలోని మూడు కేసుల్లో అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు సీఐ తెలిపారు. ఇటీవల మఠంపల్లిలోని ఓ మొబైల్ దుకాణంలో నిందితుడు చోరీకి పాల్పడ్డాడు. దొంగిలించిన ఫోన్లను ఇతరులకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్లలో వినియోగించిన కొత్త సిమ్ కార్డులు, కాల్ డేటా రికార్డులను విశ్లేషించి నిందితుడి ఆచూకీని గుర్తించారు. మరోసారి నేరానికి పాల్పడేందుకు నిందితుడు మఠంపల్లికి వచ్చినట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చరమంద రాజు వెల్లడించారు. ఈ కేసు ఛేదనలో మఠంపల్లి ఎస్సై ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పెరిగిన విద్యుత్ భారం.. ఎండిపోతున్న పంటలు:

▸▸కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్...

▸▸తీవ్ర ఆగ్రహంలో ప్రజలు, రైతాంగం....

**కేసముద్రం, నేటిధాత్రి:** రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపు భారం ఒకవైపు, నాణ్యత లేని ఉచిత విద్యుత్ సరఫరా మరోవైపు ప్రజలను, రైతులను తీవ్ర అవస్థలకు గురిచేస్తున్నాయని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ సర్‌ఛార్జీలు, ట్రూ-అప్ ఛార్జీల పేరిట సాధారణ వినియోగదారులపై అదనపు భారాన్ని మోపడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. మరోవైపు గ్రామాల్లో వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన కరెంట్ అందక మోటార్లు కాలిపోవడంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆందోళన చెందుతున్నారు.

**ప్రధాన డిమాండ్లు:** పెంచిన అదనపు విద్యుత్ ఛార్జీలను, ట్రూ-అప్ భారాలను తక్షణమే ఉపసంహరించుకోవాలి. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలి. విద్యుత్ కోతలను నివారించి సబ్‌స్టేషన్లలో సరైన మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు, రైతులతో కలసి నిరసనలు ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, బి ఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, బి ఆర్ ఎస్ టౌన్ ప్రెసిడెంట్ వీరు నాయక్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు , రావుల వినయ్ రెడ్డి, ఆగే రాము, పాయిరాల శరత్, దూడే పాక కృష్ణ, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, హరి నాయక్, బానోత్ దేవేందర్, వేర్పుల కుమారస్వామి,, కన్నబోయిన శ్రీనివాస్ మరియు బి ఆర్ ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



## కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి

**హనుమకొండ, నేటిధాత్రి:** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పిలుపునిచ్చారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత సమస్యలను తెలుసుకొని వారి మద్దతు కూడగట్టాలని సూచించారు. అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు, జాబితాలో వివరాల పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ఎన్నికల కార్యాచరణను పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షురాలిగా పారిజాత బాధ్యతల స్వీకారం



## కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తా....

**గాంధీభవన్ హైదరాబాద్, నేటిధాత్రి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గాంధీభవన్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటానికి ఆమె నాయకత్వం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పారిజాత



మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వి. హనుమంతరావు, చల్లా నర్సింహారెడ్డి, పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, సరితా తిరుపతయ్య, చరణ్ కౌశిక్ యాదవ్, రఘునాథ్ యాదవ్, కాల్వ సుజాత, సామ రామ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన అధ్యక్షురాలిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి



▸▸గడువులోగా రెవెన్యూ ఫైళ్లను పరిష్కరించాలి...

▸▸జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు....

**మంచిర్యాల, నేటిధాత్రి:** తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. గురువారం మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, తహసీల్దార్‌తో పాటు సిబ్బందితో వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ సర్టిఫికెట్ల మంజూరుకు ప్రాధాన్యత ఎస్ఐఆర్--2026లో భాగంగా దావాలు, అభ్యంతరాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ధ్రువీకరణ పత్రాలు, భూభారతి ద్వారా అందిన దరఖాస్తులు, జీఓ ఎంఎస్ నంబర్ 59, భూదాన్ భూములకు సంబంధించిన అంశాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు నిరీక్షించకుండా పెండింగ్ సర్టిఫికెట్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తన ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, సూపరింటెండెంట్లు, సంబంధిత సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల పురోగతిని సమీక్షించారు. పారదర్శక సేవలు అందించాలి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఫైలును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, కార్యాలయాలకు వచ్చే అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. కార్యాలయ ఫైళ్లు, రికార్డులను పక్కాగా నిర్వహించాలని, వాటి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విభాగం బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999